**మంచిమాట**

అతి కామం వల్ల రావణాసురుడు, అతి ఆశ వల్ల దుర్యోధనుడు, అతి దానం వల్ల బలి చక్రవర్తి నశించారు. కాబట్టి 'అతి' అన్నింటా వర్జనీయమే.

# DD9 వార్త

తెలుగు దినపత్రిక

సంపుటి : 01 సంచిక : 188 | హైదరాబాద్, ఫిబ్రవరి, బుధవారం 25, 2026 | పేజీలు : 06 వెల : 3.00


## 'ది కేరళ స్టోరీ–2'పై హైకోర్ట్ కీలక ఆదేశాలు




ట్రైలర్‌ను వెనక్కి తీసుకోవాలన్న న్యాయస్థానం
కోర్ట్ ముందు చిత్రాన్ని ప్రదర్శించాలని తీర్పు
సూచనలు పాటిస్తామన్న చిత్ర బృందం
నేడు కోర్టులో ప్రత్యేక ప్రదర్శనకు ఏర్పాట్లు
సినిమాపై తుది తీర్పుపై తీవ్ర ఉత్కంఠ

07

# ఆపరేషన్ ఆక్టోపస్...



'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో దేశవ్యాప్త సైబర్ ముఠా అరెస్ట్
16 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు.. 104 మంది అరెస్ట్
నిందితులకు సహకరించిన బంధన్ బ్యాంక్ అధికారి కూడా అరెస్ట్
దేశవ్యాప్తంగా 1,055 కేసుల్లో ₹127 కోట్ల మోసాలు చేసినట్లు గుర్తింపు
₹36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు స్వాధీనం

హైదరాబాద్, (డిడి9 వార్త):

హైదరాబాద్ పోలీసులు దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించారు. 'ఆపరేషన్ ఆక్టోపస్' పేరుతో చేపట్టిన భారీ ఆపరేషన్‌లో, దేశంలోని 16 రాష్ట్రాల్లో విస్తరించిన అతిపెద్ద సైబర్ నేరాల ముఠా గుట్టురట్టు చేశారు. పెట్టుబడులు, ట్రేడింగ్, 'డిజిటల్ అరెస్ట్' వంటి మోసాలతో అమాయక ప్రజల నుంచి కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్న ఈ నెట్‌వర్క్‌కు చెందిన 104 మందిని అరెస్ట్ చేశారు. ఈ ఆపరేషన్ వివరాలను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ సోషల్ మీడియా ..మిగతా 2లో

# ఆ నలుగురు.. సరెండర్

దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి, బడే చొక్కారావు, నూనె నర్సింహా రెడ్డి లొంగిబాటు
మిగిలిన వారు కూడా జన జీవనంలోకి రావాలి
మావోయిస్ట్ పార్టీలో ఇంకా ఉన్నది 11 మందే
దేవ్ జీ, రాజిరెడ్డికి రూ.25 లక్షలు
చొక్కారావు, నర్సింహా రెడ్డిలకు రూ.20 లక్షలు
లొంగిపోయిన అందరికీ తక్షణ సాయం
పొలిట్ బ్యూరో, కేంద్ర, రాష్ట్ర కమిటీలు నిర్వీర్యం
వివరాలు వెల్లడించిన డీజీపీ శివధర్ రెడ్డి



హైదరాబాద్, (డిడి9 వార్త):

మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురు దెబ్బ తగిలింది. నలుగురు అగ్ర నేతలు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. వీరిలో పొలిట్ బ్యూరో సభ్యుడు తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీ, సెంట్రల్ కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్, తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బడే చొక్కారావు అలియాస్ జగన్, రాష్ట్ర కమిటీ సభ్యుడు నూనె నర్సింహా రెడ్డి ఉన్నారు. డీజీపీ శివధర్ రెడ్డి హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని ఐసీసీసీలో ఇంటెలిజెన్స్ ఛీఫ్ విజయ్ కుమార్, ఎస్ఐబీ ఐజీ సుమతితో ..మిగతా 2లో

## ఆరు నెలల్లో రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి



మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి
క్షేత్రస్థాయిలో ప్రాజెక్ట్ పరిశీలన
పనుల పురోగతిపై మంత్రి ఆరా
అధికారులకు కీలక సూచనలు
రూ.394 కోట్ల అంచనా వ్యయంతో పనులు
ప్రాజెక్ట్‌తో 14 వేల ఎకరాలకు సాగునీరు

హైదరాబాద్, (డిడి9 వార్త):

నల్గొండ జిల్లా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామంలో నిర్మాణంలో ఉన్న రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పనులను రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం పరిశీలించారు. రూ.394 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు పనుల పురోగతి, నాణ్యత, గడువు వంటి అంశాలపై అధికారులను ప్రత్యక్షంగా ప్రశ్నించి వివరాలు తెలుసుకున్నారు.


ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించిన మంత్రి, నిర్మాణ పనులపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, వేగం పెంచాల్సిన అవసరం ఉందని సూచించారు. పనులు గడువులోపు పూర్తి కావాలని స్పష్టం చేశారు. సెప్టెంబర్ నెలాఖరు నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి, దాదాపు 14 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ..మిగతా 2లో



## సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ...

'సేవా తీర్థ్' నూతన ప్రాంగణంలో ప్రధాని మోదీ అధ్యక్షతన తొలి కేబినెట్ సమావేశం
దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాకు ఆమోదం
కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు గ్రీన్ సిగ్నల్
భారత్‌ను ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు 'సేవా సంకల్ప్'
రూ.12,236 కోట్లతో రైల్వే, మెట్రో సహా పలు మౌలిక ప్రాజెక్టులకు ఆమోదముద్ర

న్యూఢిల్లీ, (డిడి9 వార్త):



ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం మంగళవారం పలు చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంది. నూతనంగా ప్రారంభమైన 'సేవా తీర్థ్' సముదాయంలో జరిగిన ఈ తొలి సమావేశంలో, దేశవ్యాప్తంగా బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకా అందించడం, కేరళ పేరును 'కేరళం'గా మార్చడం సహా అనేక కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. దీంతో పాటు, రాబోయే రోజుల్లో భారత్‌ను ప్రపంచంలోని మూడు అగ్రశ్రేణి ఆర్థిక వ్యవస్థల్లో ..మిగతా 3లో

# మేం తట్టి లేపితేనే రివ్యూలా?



*రేవంత్ సర్కార్‌పై హరీశ్ రావు విమర్శలు*

వరంగల్‌లో బీఆర్ఎస్ శ్రేణులతో పర్యటన
సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పనుల పరిశీలన
పనుల్లో జాప్యంపై తీవ్ర అసంతృప్తి
బీఆర్ఎస్ హయాంలో దేవాదుల పనులు 90 శాతం పూర్తయ్యాయన్న హరీశ్
రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం రేవంత్ ఫ్యూచర్ సిటీ కలలు కంటున్నారని వ్యాఖ్య
ప్రభుత్వంపై రాజీ లేని పోరాటం చేస్తామని హెచ్చరిక

హైదరాబాద్, (డిడి9 వార్త):

తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరోసారి ముదిరింది. వరంగల్ పర్యటనకు వచ్చిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ కీలక నేత హరీశ్ రావు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యంగా వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనుల జాప్యంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఆసుపత్రి నిర్మాణ స్థలాన్ని ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరిశీలించిన అనంతరం హరీశ్ రావు మీడియాతో మాట్లాడారు. "మేము క్షేత్రస్థాయికి వచ్చి ప్రాజెక్టులను పరిశీలిస్తేనే ముఖ్యమంత్రి స్పందిస్తున్నారు. మేము విజిట్ చేసిన వెంటనే రివ్యూలు చేస్తున్నారు" అంటూ ఎద్దేవా చేశారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం ముందుగానే ..మిగతా 3లో

## జర్నలిస్టులకు ఒక్క రూపాయి ఇవ్వలేదు

జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపణ
రెండు బడ్జెట్లలో జర్నలిస్టులకు నిధులు కేటాయించలేదని విమర్శ
అక్రిడిటేషన్లు, హెల్త్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్

03

## పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణ

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు
'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'కు రెడీ
ట్రిలియన్ డాలర్ ఆర్థిక వ్యవస్థగా రాష్ట్రం
గ్రామాల వరకు అభివృద్ధి బాటలు
"గ్రోత్ ఎక్స్ 2026" సదస్సులో మంత్రి వ్యాఖ్యలు



02

## ఫలించిన సుదీర్ఘ వ్యూహం

మావోయిస్టుల లొంగుబాట్లలో తెలంగాణ టాప్
సీఎం రేవంత్ పిలుపునకు భారీ రెస్పాన్స్
గడిచిన రెండేళ్లలో 600 మంది సరెండర్

హైదరాబాద్, (డిడి9 వార్త):

పోలీసింగ్‌లో దేశంలోనే అగ్ర స్థానంలో నిలిచిన తెలంగాణ పోలీసులు మావోయిస్టుల విషయంలోనూ నెంబర్ వన్ ఫలితాలను సాధించారు. సంయమనం, సహనంతో రెండేళ్లపాటు సుదీర్ఘ వ్యూహాన్ని అమలు చేసి వందల సంఖ్యలో మావోయిస్టులను జనజీవన స్రవంతిలో కలిపారు. ఇప్పటికీ అవకాశం ఉంది, అజ్ఞాతం వీడి ..మిగతా 2లో





## ఆ వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?

ఆదిలాబాద్ జైలులో బాల్క సుమన్ ను పరామర్శించిన కేటీఆర్
గాంధీ కుటుంబానికి వేల కోట్లు పంపుతున్నారని రేవంత్ సర్కార్‌పై ఆరోపణ
ఆ వెయ్యి కోట్లు నీ అయ్యా సొమ్మా అని ముఖ్యమంత్రిని ప్రశ్నించిన వైనం
రైతు బంధు, రుణమాఫీపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శ
పాలనను వదిలేసి దోపిడీకే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని ధ్వజం
సీఎం అవినీతిపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఎందుకు మౌనంగా ఉన్నాయని నిలదీత

హైదరాబాద్, (డిడి9 వార్త):

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో పాలనను పూర్తిగా గాలికొదిలేసి, దోపిడీయే లక్ష్యంగా కాంగ్రెస్ సర్కార్ పనిచేస్తోందని, తెలంగాణ ప్రజల సొమ్మును ఢిల్లీలోని గాంధీ కుటుంబానికి తరలిస్తున్నారని సంచలన ఆరోపణలు చేశారు. ఆదిలాబాద్ జైలులో ..మిగతా 3లో

## కేరళ ఇకపై కేరళం..

కేరళ పేరును 'కేరళం'గా మార్చేందుకు కేంద్రం ఆమోదం
కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్
మలయాళ ఉచ్చారణకు అనుగుణంగా పేరు మార్పు ప్రతిపాదన
రాజ్యాంగ సవరణ ద్వారా అధికారికంగా మారనున్న పేరు



03

## రైతు ప్రయోజనాలు తాకట్టు పెట్టారు

కేంద్రంపై రాహుల్ గాంధీ విమర్శలు
భోపాల్ 'కిసాన్ మహా చౌపాల్' సభ
అమెరికా వాణిజ్య ఒప్పందంపై ఆగ్రహం
పార్లమెంట్‌లో చర్చ జరగలేదని వెల్లడి
కేబినెట్‌నూ సంప్రదించలేదన్న రాహుల్
మోడీకి స్వప్రయోజనాలే ముఖ్యమని వ్యాఖ్య



న్యూఢిల్లీ, (డిడి9 వార్త):

కేంద్ర ప్రభుత్వంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి ఘాటు విమర్శలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కేంద్ర కేబినెట్‌ను సంప్రదించకుండా అమెరికాతో వాణిజ్య ఒప్పందం ఖరారు చేశారని ఆరోపించారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన ..మిగతా 3లో

# ఫలించిన సుదీర్ఘ వ్యూహం

**మొదటిపేజీ తరువాయి**

జనంలోకి రండి, ప్రభుత్వం కల్పించిన పునరావాస పథకాల ప్రయోజనాలను పొందండి అంటూ మిగిలిన కొద్దిమందికి పిలుపునిస్తున్నారు. అన్ని రకాలుగా అండగా ఉంటామని చెబుతున్నారు.

**2019 నుంచి శ్రీకారం**

మావోయిస్ట్ పార్టీ ఉనికి లేకుండా చేయడానికి కేంద్ర ప్రభుత్వం 2019 నుంచే చర్యలకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఆ పార్టీ ప్రభావం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లోని అడవుల్లో బేస్ క్యాంపుల నిర్మాణానికి శ్రీకారం చుట్టి ఈ ప్రణాళిక అమలును ప్రారంభించింది. 2024 జనవరి 1న ఆపరేషన్ కగార్‌ను ప్రారంభించిన కేంద్రం, 2026 మార్చి 31వ తేదీలోపు మావోయిస్ట్ పార్టీని పూర్తిగా అంతం చేస్తామని ప్రకటించింది. ఇందులో భాగంగా వేలాది సంఖ్యలో భద్రతా బలగాలను రంగంలోకి దింపింది. వారి చేతికి అత్యంత అధునాతన ఆయుధాలతోపాటు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందచేసింది. ఈ క్రమంలో ఆయా రాష్ట్రాల్లో పదుల సంఖ్యలో ఎన్ కౌంటర్లు జరిగాయి. పెద్ద సంఖ్యలో మావోయిస్ట్ పార్టీ నేతలతోపాటు క్యాడర్ నేలకొరిగింది.

**తెలంగాణలో భిన్నమైన వ్యూహం**

మిగితా రాష్ట్రాల్లో మావోయిస్టులపై దమన నీతిని ప్రయోగించగా తెలంగాణ పోలీసులు ఇక్కడ దానికి పూర్తి భిన్నమైన వ్యూహాన్ని అమలు చేశారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్రం నుంచి ఎంత ఒత్తిడి వచ్చినా ఎక్కడా తలొగ్గలేదు. బుల్లెట్‌కు బుల్లెట్టే సమాధానం కాదనే విధంగా ముందుకు సాగారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మావోయిస్టులు జనజీవన స్రవంతిలో కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వేర్వేరు సందర్భాల్లో డీజీపీ శివధర్ రెడ్డి కూడా పోరు వద్దు ఊరు ముద్దు అంటూ ఏళ్ల తరబడిగా అజ్ఞాతంలో ఉన్న వారిని ప్రజా క్షేత్రంలోకి ఆహ్వానించారు. మావోయిస్టుల కట్టడి కోసం ప్రత్యేకంగా ఏర్పాటైన స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో(ఎస్ఐబీ)లో సుదీర్ఘకాలం పని చేసిన అనుభవం ఉన్న ప్రస్తుత డీజీపీ శివధర్ రెడ్డి, ప్రస్తుతం ఆ విభాగంలో ఐజీగా విధులు నిర్వర్తిస్తున్న సుమతి దీని కోసం దీర్ఘకాల వ్యూహాన్ని అమలు చేశారు. ఆపరేషన్ కగార్ జోరుగా అమలవుతున్న వేళ తమదైన శైలిలో వ్యవహరించారు. లొంగిపోతే అన్ని రకాలుగా అండగా ఉంటాం, ప్రభుత్వం కల్పించిన పునరావాస పథకాల ప్రయోజనాలు అందేలా చూస్తామనే నమ్మకాన్ని మావోయిస్టుల్లో కల్పించారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయం అందచేయడంతో పాటు వారి పేరిట ఉన్న రివార్డుల మొత్తాన్ని వారికే అందించారు. జీవితంలో స్థిరపడడానికి సంపూర్ణ సహాయ సహకారాలు అందజేశారు. ఓవైపు కేంద్రం నుంచి తీవ్రస్థాయిలో ఒత్తిడి వచ్చినా ఎక్కడా సంయమనం కోల్పోలేదు. ఈ క్రమంలో గడిచిన రెండేళ్లలో 600 మంది మావోయిస్టులు తెలంగాణ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఇక్కడ గమనించాల్సిన అంశం ఏమిటంటే సరెండర్ అయిన వారిలో 90 శాతం మందికి పైగా మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన వారు ఉన్నారు. మావోయిస్టుల్లో రాష్ట్ర పోలీసులు ఎంతగా నమ్మకం కల్పించారో దీనిని బట్టే స్పష్టమవుతుందని అధికారులు అంటున్నారు.

**హింసకు ప్రతి హింస జవాబు కాదు**

హింసకు ప్రతి హింస సమాధానం కాదన్నది దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన మహాత్మా గాంధీ చెప్పిన మాట. సరిగ్గా దీనిని ఆచరణలో చూపించారు మన రాష్ట్ర పోలీసులు. తాజాగా దేవ్ జీ, మల్లా రాజిరెడ్డి, నూనె నర్సింహా రెడ్డి, బడే చొక్కారావు సరెండర్‌తో రాష్ట్రంలో మావోయిస్ట్ పార్టీ ఉనికి నామమాత్రమైంది. ఉమ్మడి రాష్ట్రంలో పీపుల్స్ వార్ పేర ప్రారంభమైన ఉద్యమానికి సాఫ్ట్ ఆపరేషన్ ద్వారా తెలంగాణ పోలీసులు తమదైన శైలిలో ముగింపు ఇవ్వడంపై కేంద్రం నుంచి కూడా ప్రశంసలు అందినట్టుగా తెలిసింది.

# పెట్టుబడుల కేంద్రంగా తెలంగాణ

**హైదరాబాద్, (డిడి9 వార్త):**



తెలంగాణను అంతర్జాతీయ పెట్టుబడుల కేంద్రంగా నిలపాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం కొత్త ఆర్థిక విధానాలకు శ్రీకారం చుడుతోంది. త్వరలోనే 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0'ను ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. పెట్టుబడిదారులకు మరింత సులభతరం, పారదర్శకత కల్పించే విధంగా ఈ కొత్త విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు.మంగళవారం జూబ్లీహిల్స్‌లోని జేఆర్సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఫ్యాప్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన "గ్రోత్ ఎక్స్ 2026" సదస్సుకు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పారిశ్రామికాభివృద్ధి యాదృచ్ఛికంగా సాధ్యమయ్యేది కాదని అన్నారు. దీర్ఘకాల ప్రణాళికతో ముందుకు సాగితేనే రాష్ట్రానికి స్థిరమైన వృద్ధి సాధ్యమని చెప్పారు.

తెలంగాణ ప్రస్తుతం సుమారు 200 బిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఉందని, 2034 నాటికి దానిని ఒక ట్రిలియన్ డాలర్లకు, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ దిశగా "తెలంగాణ విజన్ 2047" రూపొందించామని వివరించారు.రాష్ట్ర సమగ్రాభివృద్ధి కోసం "క్యూర్ - ప్యూర్ - రేర్" అనే త్రిముఖ వ్యూహాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఆరోగ్యం, పరిశుభ్రత, వనరుల సమర్థ వినియోగం వంటి అంశాలకు ప్రాధాన్యం ఇస్తూ నగరం నుంచి గ్రామం వరకు అభివృద్ధి చేర్చాలన్నదే ప్రభుత్వ అజెండా అని అన్నారు.

పరిశ్రమల స్థాపనలో పెట్టుబడిదారులు ఎదుర్కొనే అడ్డంకులను తొలగించడమే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0 లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచే విధంగా పారదర్శక విధానాలు తీసుకురావాలని భావిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాలతో చర్చించి, వారి సూచనలు తీసుకుని కొత్త విధానాన్ని రూపొందిస్తామని తెలిపారు. సాంకేతిక రంగంలో వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్నాయని, ఏఐ, ఇండస్ట్రీ 5.0 వంటి టెక్నాలజీలు పని సంస్కృతిని పూర్తిగా మార్చేశాయని మంత్రి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ఒక్కో కంపెనీ కంటే సమగ్ర 'ఎకోసిస్టమ్'కే ప్రాధాన్యత పెరుగుతుందని అన్నారు. అందుకే భవిష్యత్తును ఎదురుచూడకుండా, దానిని నిర్మించాలనే సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం పరిశ్రమలకు కేవలం అనుమతులు ఇచ్చే యంత్రాంగంగా కాకుండా, భాగస్వామిగా ఉండాలని భావిస్తున్నామని మంత్రి స్పష్టం చేశారు. పెట్టుబడిదారులు ప్రభుత్వంతో కలిసి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పారిశ్రామిక వేత్తలు, స్టార్టప్‌లు, సాంకేతిక సంస్థలు కలిసి పనిచేస్తే తెలంగాణ మరింత వేగంగా అభివృద్ధి సాధిస్తుందని అన్నారు.ఫ్యాప్సీ నిర్వహించిన ఈ సదస్సులో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు, ప్రముఖ వైద్యులు డా. నాగేశ్వర్ రెడ్డి, ఫ్యాప్సీ ప్రెసిడెంట్ ఆర్. రవి కుమార్, స్కైరూట్ ఏరో స్పేస్ ప్రతినిధి పవన్, గ్రోత్ ఎక్స్ 2026 కన్వీనర్ పంకజ్ దివాన్ తదితరులు పాల్గొన్నారు. వారు కూడా రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి, పెట్టుబడుల వాతావరణంపై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

తెలంగాణ ఇప్పటికే ఐటీ, ఫార్మా, బయోటెక్, ఏరోస్పేస్ రంగాల్లో దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు సంపాదించిందని మంత్రి తెలిపారు. కొత్త విధానాల ద్వారా మరిన్ని రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. తెలంగాణను దీర్ఘకాలిక ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం స్పష్టమైన రోడ్‌మ్యాప్‌తో ముందుకు సాగుతోందని మంత్రి పేర్కొన్నారు. 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ 2.0' అమలులోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో పెట్టుబడులు మరింత పెరుగుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పరిశ్రమలు, స్టార్టప్‌లు, యువ పారిశ్రామికవేత్తలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

# ఆ నలుగురు.. సరెండర్



**మొదటిపేజీ తరువాయి**

కలిసి వివరాలు వెల్లడించారు.

**లొంగిపోయిన వారికి తక్షణ సాయం**

అడవులను వదిలేసి జనజీవన స్రవంతిలో కలిసి రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన పిలుపునకు మావోయిస్టుల నుంచి సానుకూల స్పందన వచ్చినట్టుగా డీజీపీ చెప్పారు. వరుసగా జరుగుతున్న లొంగుబాట్లు దీనికి నిదర్శనమన్నారు. అనారోగ్య సమస్యలు, ఆపరేషన్ కగార్ నేపథ్యంలో అడవుల్లో ఉండలేని పరిస్థితి కూడా మావోయిస్టులను లొంగు'బాట' పట్టిస్తున్నాయని తెలిపారు. లొంగిపోయిన వారికి తక్షణ సహాయం అందచేస్తున్నట్టు చెప్పారు. దేవ్ జీ, మల్లా రాజిరెడ్డిలపై 25 లక్షల చొప్పున రివార్డ్ ఉన్నట్టు చెప్పిన డీజీపీ, ఆ మొత్తాన్ని వారికే అందచేస్తామన్నారు. బడే చొక్కారావు, నూనె నర్సింహా రెడ్డిలపై 20 లక్షల చొప్పున రివార్డులు ఉన్నట్టు తెలిపారు.

**మిగిలిన 11 మంది కూడా రావాలి**


లొంగిపోయిన మావోయిస్టుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పునరావాస పథకాల ప్రయోజనాలను వారికి కల్పిస్తామని శివధర్ రెడ్డి చెప్పారు. వారు జనజీవన స్రవంతిలో కలిసిపోయి గౌరవంగా జీవించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రస్తుతం మావోయిస్ట్ పార్టీ చరమాంకంలో ఉన్నట్టుగా తెలిపారు. ప్రస్తుతం తెలంగాణకు చెందిన వారు కేవలం 11 మంది మాత్రమే ఉన్నారని చెప్పారు. వీరిలో సెంట్రల్ కమిటీలో ఇద్దరు, స్టేట్ కమిటీలో ముగ్గురు, డివిజన్ కమిటీలో ఇద్దరు, ఏసీఎంలు ఉన్నట్టు తెలిపారు. వారందరూ జనజీవన స్రవంతిలో కలవడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

**మావోయిజానికి అంతం లేదు**

మల్లా రాజిరెడ్డి మాట్లాడుతూ, మావోయిజానికి అంతం లేదన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇది అభివృద్ధి చెందుతూనే ఉంటుందని చెప్పారు. సాయుధ పోరాటం ముగిసిందా లేదా అనే దానిపై ఎవరి అభిప్రాయాలు వారివి అని చెప్పారు. లొంగిపోవడానికి ముందు తాము దీని గురించి మాట్లాడుకోలేదని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారుల పిలుపు మేరకు లొంగిపోవాలనే నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. అయితే, ప్రజా సమస్యలపై పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. తమ సిద్ధాంతాలకు అనుగుణంగా ఈ పోరాటాలు ఉంటాయని చెప్పారు. ప్రభుత్వంతో చర్చించిన తరువాత మిగిలిన మావోయిస్టులకు సందేశం ఇస్తామన్నారు.

**రాజకీయాల్లోకి వస్తా..**

లొంగిపోయిన దేవ్ జీ మాట్లాడుతూ, భవిష్యత్తులో తాను రాజకీయాల్లోకి వస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజలతో కలిసి చట్టబద్ధమైన పోరాటాలు చేస్తానన్నారు. అనారోగ్య కారణాల వల్ల లొంగిపోయినట్టుగా చెప్పారు. వ్యక్తిగత జీవితం కోసం తాను బయటకు రాలేదన్నారు. మల్లోజుల వల్లనే పార్టీలో సంక్షోభం తలెత్తిందా అనే ప్రశ్నకు ఆయన సమాధానం చెప్పలేదు. పార్టీ అంతర్గత విషయాలపై ఇప్పుడు మాట్లాడడం సరైంది కాదని స్పందించారు. ప్రస్తుతం అసలేం జరిగిందనే దానిపై సమగ్రంగా చెప్పలేని పరిస్థితి ఉన్నదన్నారు. ఏ ఒక్కరి గురించి మాట్లాడినా అనవసర చర్చలకు దారితీస్తుందని వ్యాఖ్యానించారు. అనవసర అపార్థాలకు కారణం కాకూడదనే సంక్షిప్తంగా మాట్లాడుతున్నట్టు తెలిపారు. సరైన సమయంలో సరైన వేదిక నుంచి అన్ని విషయాలు చెబుతానని దేవ్ జీ అన్నారు.



**ఎల్‌ఎల్‌బీ చదువుతూ..**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుంటూరు జిల్లా వల్లూరు గ్రామానికి చెందిన నూనె నర్సింహా రెడ్డి నరసరావుపేట డిగ్రీ కాలేజీ నుంచి బీఎస్సీ (బీజెడ్‌సీ) పూర్తి చేశారు. ఆ తరువాత నాగార్జున వర్సిటీలో ఎల్‌ఎల్‌బీలో చేరారు. ఆ సమయంలో రిటైర్డ్ లెక్చరర్ జంధ్యాల రవీంద్రనాథ్ నాయకత్వంలో రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చేరారు. అనంతరం మావోయిస్ట్ పార్టీలో చేరి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారు.

**రాడికల్ స్టూడెంట్ యూనియన్‌తో మొదలు**



జగిత్యాల జిల్లా కోరుట్ల గ్రామానికి చెందిన తిప్పిరి తిరుపతి అలియాస్ దేవ్ జీది వ్యవసాయ కుటుంబం. 10వ తరగతి పాసైన తరువాత ఇంటర్ చదవడానికి కోరుట్ల ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరారు. ఆ సమయంలోనే దేవ్ జీకి రాడికల్ స్టూడెంట్ యూనియన్‌తో పరిచయం ఏర్పడింది. విప్లవ రాజకీయాల పట్ల ఆకర్షితుడై అందులో చేరి కోరుట్ల టౌన్ అధ్యక్షుడిగా, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. 1978లో పీపుల్స్ వార్ (ప్రస్తుత మావోయిస్ట్ పార్టీ) నిర్వహించిన జగిత్యాల జైత్రయాత్రలో పాల్గొన్న దేవ్ జీ 1982లో ఆ పార్టీలో చేరారు. అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం పొలిట్ బ్యూరో సభ్యుడిగా ఉన్నారు.

**రైతు కుటుంబం నుంచి వచ్చి..**



పెద్దపల్లి జిల్లా మంథని మండలం శాస్త్రుల పల్లెకు చెందిన మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్‌ది కూడా వ్యవసాయ కుటుంబమే. 1975లో రత్తమ్మ అలియాస్ నిర్మలను వివాహం చేసుకోగా స్నేహలత అనే కుమార్తె పుట్టింది. బిడ్డకు జన్మనిచ్చిన తరువాత 1982లో పీపుల్స్ వార్ పార్టీలో చేరారు. ఆ తరువాత 2001లో పార్టీలో సభ్యురాలిగా ఉన్న మజ్జిబిచ్చి అలియాస్ సుగుణను రెండో పెళ్లి చేసుకున్నారు. రాజిరెడ్డి కూడా రాడికల్ స్టూడెంట్ యూనియన్ ప్రభావంతోనే విప్లవ బాట పట్టారు. కోరుట్ల, జగిత్యాలలో నమోదైన కేసుల్లో పోలీసులు 1976లో అరెస్ట్ చేయగా ఆ మరుసటి సంవత్సరం విడుదలయ్యారు. ఆ తరువాత రెండేళ్లపాటు గోదావరి ఖని బొగ్గు గనుల ప్రాంతంలో ఆర్గనైజర్‌గా పని చేశారు. 1988లో మరోసారి అరెస్టయిన రాజిరెడ్డి ఆదిలాబాద్ జైలు నుంచి పారిపోయి సాయధ దళంలో చేరడం ద్వారా అజ్ఞాత జీవితాన్ని ప్రారంభించారు. ప్రస్తుతం మావోయిస్ట్ పార్టీ దండకారణ్య స్పెషల్ జోన్ కమిటీ ఇన్ ఛార్జ్‌గా వ్యవహరిస్తున్నారు.

**బంధువు ప్రోద్బలంతో..**



ములుగు జిల్లా తాడ్వాయి మండలం కాల్వపల్లి గ్రామానికి చెందిన బడే చొక్కారావు అలియాస్ దామోదర్ 10వ తరగతి చదువుతున్న సమయంలోనే రాడికల్ స్టూడెంట్ యూనియన్ పట్ల ఆకర్షితులయ్యారు. ఈయన సమీప బంధువు బడే నాగేశ్వరరావు అలియాస్ ప్రభాకర్ అప్పటికే మావోయిస్ట్ పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. ఆయన ప్రోద్బలంతో పార్టీలో చేరారు. మొదట దళ సభ్యుడిగా చేరిన బడే చొక్కారావు అంచెలంచెలుగా ఎదిగి ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర కమిటీ కార్యదర్శిగా ఉన్నారు.

# ఆరు నెలల్లో రాజీవ్ లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి

**మొదటిపేజీ తరువాయి**

అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన రోజుల్లో ఈ ప్రాంతానికి చేరుకోవడమే కష్టంగా ఉండేదని గుర్తుచేశారు. రహదారులు సరిగా లేకపోవడం, సాగునీటి సదుపాయాలు లేకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారని చెప్పారు. గతంలో అమలు చేసిన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల వల్ల దొండపాడు పరిసర ప్రాంతాలకు సాగునీరు అందించగలిగామని వివరించారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. పంటల సాగుకు నిరంతర నీటి సరఫరా ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైతులకు స్థిరమైన నీటి వనరులు అందుబాటులోకి వస్తాయని, పంటల దిగుబడులు పెరుగుతాయని అభిప్రాయపడ్డారు. పనులు వేగవంతం చేసేందుకు అవసరమైన సాంకేతిక, ఆర్థిక మద్దతు ప్రభుత్వం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు సూచించారు. అభివృద్ధి కార్యక్రమాల విజయవంతానికి ప్రజల సహకారం కూడా అవసరమని స్పష్టం చేశారు.

రాజకీయ అంశాలపై కూడా మంత్రి వ్యాఖ్యానించారు. ఓట్ల సమయంలో కాంగ్రెస్ పార్టీకి ఆశించిన స్థాయిలో మద్దతు లభించడం లేదని అన్నారు. అభివృద్ధి పథకాలు కొనసాగాలంటే ప్రజలు అభివృద్ధి దిశగా పనిచేసే నాయకత్వాన్ని ఎన్నుకోవాలని సూచించారు.ఈ సందర్భంగా శివగంగా లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద కాపర్ వైర్ చోరీ జరిగిన విషయం కొంతమంది రైతులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై మంత్రి తీవ్రంగా స్పందించారు. అక్కడే ఉన్న డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డికి వెంటనే కేసు నమోదు చేసి దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు.



నిందితులను త్వరగా పట్టుకుని కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

లిఫ్ట్ వద్ద భద్రతా లోపాలపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు. విధుల్లో నిర్లక్ష్యం వహించిన గార్డును వెంటనే తొలగించాలని అధికారులకు సూచించారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థల సంరక్షణలో రైతులు కూడా భాగస్వాములవ్వాలని మంత్రి కోరారు. పరస్పర సమన్వయంతో ఒక కమిటీ ఏర్పాటు చేసి ప్రాజెక్టు రక్షణ, నిర్వహణపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రభుత్వ యంత్రాంగం, రైతులు కలసి పనిచేస్తేనే అభివృద్ధి కార్యక్రమాలు ఫలిస్తాయని అన్నారు. ఈ పరిశీలన కార్యక్రమంలో సీఈ రమేష్ బాబు, డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, ఈఈ కిషోర్, ఏఈ శ్రీనివాస్, తహసీల్దార్ సూరయ్య, ఎస్సై సందీప్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నరాల కొండారెడ్డి, చిలకల శ్రీనివాస్ రెడ్డి, నందిరెడ్డి ఇంద్రారెడ్డి, దేవి రెడ్డి లక్ష్మారెడ్డి, సర్పంచ్ చెన్నకేశి వెంకయ్య, కొండపల్లి సుందర్ రావు తదితరులు పాల్గొన్నారు. రాజీవ్ గాంధీ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులు పూర్తి అయితే చింతలపాలెం మండలంతో పాటు పరిసర గ్రామాల రైతులకు పెద్ద ఊరటనిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గడువులోపు పనులు పూర్తవుతాయా లేదా అన్నది ఇప్పుడు కీలకంగా మారింది. రైతులు మాత్రం ప్రాజెక్టు త్వరగా పూర్తి కావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఆపరేషన్ ఆక్టోపస్...

**మొదటిపేజీ తరువాయి**



ద్వారా వెల్లడించారు.

ఇటీవలి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరిగిపోయాయి. అమాయకులను నమ్మించి, భయపెట్టి, వారి బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్న ఘటనలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యంలో డీసీపీ (సైబర్‌క్రైమ్స్) వి. అరవింద్ బాబు నేతృత్వంలో హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు (CCPS) ఈ మోసాలపై లోతైన దర్యాప్తు చేపట్టారు. నేరగాళ్లు బాధితుల నుంచి దోచుకున్న సొమ్మును మళ్లించడానికి ఉపయోగిస్తున్న 151 బ్యాంకు ఖాతాలను గుర్తించారు. ఈ ఖాతాల ఆధారంగా దేశవ్యాప్తంగా విస్తరించిన ముఠా వివరాలను ఛేదించారు.

ఈ భారీ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకిలించేందుకు 32 ప్రత్యేక పోలీస్ బృందాలను ఏర్పాటు చేశారు. ఇన్‌స్పెక్టర్ స్థాయి అధికారుల నేతృత్వంలోని ఈ బృందాలు 10 రోజుల పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, రాజస్థాన్, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, ఉత్తర ప్రదేశ్, గుజరాత్, హర్యానా, పంజాబ్, ఆంధ్రప్రదేశ్, అస్సాం, మధ్యప్రదేశ్, బీహార్, ఉత్తరాఖండ్, ఒడిశా రాష్ట్రాల్లో ఏకకాలంలో మెరుపు దాడులు నిర్వహించాయి. ఈ దాడుల్లో మొత్తం 104 మందిని అదుపులోకి తీసుకున్నారు.

అరెస్టయిన వారిలో 86 మంది 'మ్యూల్ అకౌంట్ హోల్డర్లు' ఉన్నారు. వీరు తమ బ్యాంకు ఖాతాలను కమీషన్ కోసం సైబర్ నేరగాళ్లకు అప్పగించారు. మరో 17 మంది ఈ ఖాతాలను సేకరించి ముఠా సూత్రధారులకు అందించే ఏజెంట్లుగా పనిచేస్తున్నారు. అత్యంత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, ఈ ముఠాతో కుమ్మక్కై నకిలీ ఖాతాలు తెరిచేందుకు సహకరించిన బంధన్ బ్యాంకుకు చెందిన ఓ రిలేషన్‌షిప్ మేనేజర్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

అరెస్టయిన ఈ నిందితులకు దేశవ్యాప్తంగా నమోదైన 1,055 సైబర్ ఫ్రాడ్ కేసులతో సంబంధం ఉన్నట్లు తేలిందని, ఈ మోసాల మొత్తం విలువ సుమారు రూ.127 కోట్లు ఉంటుందని కమిషనర్ తెలిపారు. నిందితుల నుంచి రూ.36 లక్షల నగదు, 204 మొబైల్ ఫోన్లు, 141 సిమ్ కార్డులు, 234 డెబిట్/క్రెడిట్ కార్డులు, 26 ల్యాప్‌టాప్‌లు, 152 బ్యాంకు పాస్‌బుక్‌లు, 56 కంపెనీ స్టాంపులను స్వాధీనం చేసుకున్నారు.

జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (స్పెషల్ బ్రాంచ్) ఎస్.ఎం. విజయ్ కుమార్, డీసీపీ అరవింద్ బాబు పర్యవేక్షణలో ఈ ఆపరేషన్ విజయవంతమైందని కమిషనర్ ప్రశంసించారు. సైబర్ నేరాల పట్ల 'జీరో టాలరెన్స్' విధానాన్ని అవలంబిస్తున్నామని, ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతోందని స్పష్టం చేశారు. ముఠాలోని ప్రధాన సూత్రధారులను పట్టుకునేందుకు దర్యాప్తు ముమ్మరం చేశామని, సైబర్ నేరగాళ్లకు సహకరించే బ్యాంకు అధికారులు, మ్యూల్ ఖాతాదారులతో సహా ఎవరినీ వదిలిపెట్టేది లేదని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.

# మేం తట్టి లేపితేనే రివ్యూలా?..

మొదటిపేజీ తరువాయి

స్పందించాల్సిందని సూచించారు.దేవాదుల ప్రాజెక్టు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని ఆయన ఆరోపించారు. తమ ప్రభుత్వ హయాంలోనే 90 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పూర్తి చేయడంలో ఈ ప్రభుత్వం విఫలమైందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నా ఒక్క ఎకరా భూమిని కూడా సేకరించలేదని, కొత్తగా ఒక్క ఎకరాకు సాగునీరు అందించలేదని విమర్శించారు. దేవాదుల ప్రాజెక్టు తమకు ప్రాధాన్యత అని ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పనులు నెమ్మదిగా సాగుతున్నాయని అన్నారు.
పేదల ఆరోగ్య రక్షణ కోసం కేసీఆర్ హెల్త్ సిటీ ఆలోచనను తీసుకువచ్చారని, అయితే ప్రస్తుత ప్రభుత్వం ఫ్యూచర్ సిటీ పేరుతో రియల్ ఎస్టేట్ అభివృద్ధిపై దృష్టి పెడుతోందని హరీశ్ రావు వ్యాఖ్యానించారు. వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను కేసీఆర్‌కు పేరు వస్తుందనే కారణంతో ఆలస్యం చేస్తున్నారని ఆరోపించారు. వరంగల్ ఎంజీఎం ఆసుపత్రి పరిస్థితి దయనీయంగా మారిందని, ఏడాదిన్నరగా గుండె శస్త్ర చికిత్సలు నిలిచిపోయాయని తెలిపారు. గతంలో తమ ప్రభుత్వం ఏర్పాటు చేసిన మూడు ఆక్సిజన్ ప్లాంట్లలో ఒక్కటి కూడా ప్రస్తుతం పనిచేయకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.
ఇకపై ప్రభుత్వ వైఫల్యాలపై రాజీ పడబోమని హరీశ్ రావు హెచ్చరించారు. "రెండేళ్లు ఓపిక పట్టాం. ఇక నుంచి గట్టిగా ప్రశ్నిస్తాం" అన్నారు. అసెంబ్లీలో కెమెరాలు తిప్పకుండా, మైకులు కట్ చేయకుండా చర్చించేందుకు ముఖ్యమంత్రికి సాహసం ఉందా? అని సవాల్ విసిరారు. అభివృద్ధి పనుల్లో ఇదే పరిస్థితి కొనసాగితే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు.జర్నలిస్టుల సంక్షేమం అంశాన్ని కూడా హరీశ్ రావు ప్రస్తావించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు ప్రత్యేక హెల్త్ స్కీమ్ అమలు చేశామని గుర్తుచేశారు. జర్నలిస్టుల సంక్షేమ నిధికి రూ.100 కోట్లతో ప్రత్యేక ఫండ్ ఏర్పాటు చేశామని చెప్పారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బడ్జెట్లలో జర్నలిస్టుల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని విమర్శించారు.
రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డు జారీ చేశారా? అని ప్రశ్నించారు. జర్నలిస్టులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా వెంటనే అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్ ప్రీమియంను ప్రభుత్వమే చెల్లించాలని, లేకపోతే ప్రమాదాల సమయంలో కుటుంబాలు ఇబ్బందులు పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంతో సమానంగా జర్నలిస్టులకు



కూడా ఆరోగ్య భద్రత కల్పించాలని కోరారు. వరంగల్ పర్యటనలో హరీశ్ రావు చేసిన వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం మరింత ముదురే సూచనలు కనిపిస్తున్నాయి. అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై రాబోయే రోజుల్లో రాజకీయ వాదోపవాదాలు మరింత పెరగనున్నాయి.

## జర్నలిస్టులకు ఒక్క రూపాయి ఇవ్వలేదు

- **జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని ఆరోపణ**
- **రెండు బడ్జెట్లలో జర్నలిస్టులకు నిధులు కేటాయించలేదని విమర్శ**
- **అక్రిడిటేషన్లు, హెల్త్ స్కీమ్ వెంటనే అమలు చేయాలని డిమాండ్**

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత టి. హరీశ్ రావు తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. జర్నలిస్టుల సంక్షేమాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, వారిని చూస్తేనే విసుక్కుంటోందని ఆరోపించారు. ఇవాళ వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులను ఇతర బీఆర్ఎస్ నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.
ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ.. తమ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగులతో పాటు జర్నలిస్టులకు హెల్త్ స్కీమ్ తెచ్చామని, జర్నలిస్టులకు పూర్తి ఉచితంగా సేవలు అందించామని గుర్తుచేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జర్నలిస్టుల సంక్షేమం కోసం రూ.100 కోట్లతో ప్రత్యేక నిధి ఏర్పాటు చేశారని, కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం రెండు బడ్జెట్లలో జర్నలిస్టులకు ఒక్క రూపాయి కూడా కేటాయించలేదని ప్రశ్నించారు.
రెండున్నరేళ్లలో ఒక్కరికైనా కొత్త అక్రిడిటేషన్ కార్డు ఇచ్చారా? అని ప్రభుత్వంపై హరీశ్ రావు ధ్వజమెత్తారు. జర్నలిస్టులకు ఎలాంటి నిబంధనలు లేకుండా వెంటనే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసినట్లుగానే జర్నలిస్టుల యాక్సిడెంటల్ ఇన్సూరెన్స్‌కు ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని, లేకపోతే వారి కుటుంబాలు రోడ్డున పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగుల ఆరోగ్య పథకంతో సమానంగా జర్నలిస్టుల హెల్త్ స్కీమ్‌ను కూడా అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

## రైతు ప్రయోజనాలు తాకట్టు పెట్టారు

మొదటిపేజీ తరువాయి



'కిసాన్ మహా చౌపాల్' సభలో పాల్గొన్న ఆయన, ఈ ఒప్పందం దేశ రైతుల ప్రయోజనాలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని అన్నారు. సభలో మాట్లాడుతూ రాహుల్ గాంధీ, అమెరికాతో కుదిరిన వాణిజ్య ఒప్పందం అత్యంత రహస్యంగా జరిగిందని ఆరోపించారు. ఈ నిర్ణయం తీసుకునే ముందు పార్లమెంట్‌లో చర్చ జరగలేదని, కేబినెట్‌ను కూడా సంప్రదించలేదని అన్నారు. ఇది రైతుల గుండెల్లో గుచ్చిన బాణం లాంటిదని వ్యాఖ్యానించారు.
ఈ ఒప్పంద పత్రం అమెరికా నిబంధనలకు అనుగుణంగా తయారైందని, భారత ప్రభుత్వం కేవలం ఆమోదం తెలిపిందని విమర్శించారు. దేశ ప్రజల డేటాను కూడా ఈ ఒప్పందం ద్వారా అమెరికాకు అప్పగించారని ఆరోపించారు. అమెరికా సుప్రీం కోర్టు ఇచ్చిన తాజా తీర్పు నేపథ్యంలో ఈ డీల్‌ను రద్దు చేసే ధైర్యం ప్రధానికి ఉందా? అని సవాల్ విసిరారు.యువ కాంగ్రెస్ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రధాని మోదీని చూసి ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. బడ్జెట్ సమావేశాల్లో ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా సభను వదిలి వెళ్లారని ఆరోపించారు. దేశ ప్రయోజనాల కంటే వ్యక్తిగత ఇమేజ్‌ను కాపాడుకోవడానికే ప్రధాని చర్యలు తీసుకుంటున్నారని అన్నారు.
వివాదాస్పద ఎప్‌స్టీన్ కేసుకు సంబంధించిన ఫైల్స్ అంశాన్ని కూడా రాహుల్ ప్రస్తావించారు. ఆ కేసులో కొంతమంది భారత నేతల పేర్లు ఉన్నాయని ఆరోపించారు. రానున్న రోజుల్లో మరికొంత మంది సీనియర్ నాయకుల పేర్లు బయటకు రావచ్చని వ్యాఖ్యానించారు.జాతీయ భద్రత అంశంపై కూడా రాహుల్ గాంధీ ప్రశ్నలు లేవనెత్తారు. మాజీ ఆర్మీ చీఫ్ ఎంఎం నరవణే తన పుస్తకంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, చైనా సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పుడు నిర్ణయాల విషయంలో స్పష్టత లేకపోయిందని అన్నారు. యుద్ధం చేయాలా వద్దా అన్నది రాజకీయ నిర్ణయం కావాలని, అది సైన్యంపై మోపకూడదని స్పష్టం చేశారు.
ఇండో-యూఎస్ ట్రేడ్ ఒప్పందంపై ఆయన మరోసారి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందం వ్యవసాయ రంగాన్ని దెబ్బతీస్తుందని, రైతులు మరియు వ్యవసాయ కార్మికులు దీనిని అంగీకరించలేదని అన్నారు. ఐదు నెలల పాటు చర్చలు నిలిచిపోయాయని, అయినప్పటికీ చివరకు ప్రధాని నేరుగా అమెరికా అధ్యక్షుడితో మాట్లాడి ఒప్పందానికి సిద్ధమయ్యారని ఆరోపించారు."కొన్ని నెలలు ఎలాంటి పురోగతి లేదు. ఒక్కసారిగా నిర్ణయం తీసుకుని రైతులను అమ్మేశారు. గార్మెంట్ రంగాన్నీ నష్టపరిచారు. దేశ డేటాను విదేశాలకు అప్పగించారు," అని రాహుల్ తీవ్రంగా విమర్శించారు. ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.
దేశవ్యాప్తంగా పెద్ద కార్పొరేట్ సంస్థలకు ప్రాధాన్యం పెరుగుతోందని, ఒక సంస్థ పేరే ఎక్కడ చూసినా వినిపిస్తోందని కూడా ఆయన విమర్శించారు. ప్రభుత్వ విధానాలు కొందరి ప్రయోజనాల కోసం మలచబడుతున్నాయనే అనుమానం ప్రజల్లో ఉందన్నారు.పార్లమెంటరీ వ్యవస్థపై కూడా రాహుల్ గాంధీ అసంతృప్తి వ్యక్తం చేశారు. లోక్‌సభ ప్రతిపక్ష నేతగా తనకు మాట్లాడే అవకాశం ఇవ్వలేదని చెప్పారు. సభలో మాట్లాడడం ప్రారంభించగానే అడ్డుకున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.
రైతుల ప్రయోజనాలు, జాతీయ భద్రత, పార్లమెంటరీ సంప్రదాయాల పరిరక్షణలో కేంద్రం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాహుల్ కోరారు. దేశ ప్రయోజనాల కంటే రాజకీయ ప్రయోజనాలు ముందుకు రాకూడదని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ప్రజలతో కలిసి ఈ అంశాలపై పోరాటం కొనసాగిస్తామని ప్రకటించారు.భోపాల్ వేదికగా జరిగిన ఈ సభలో రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కేంద్ర ప్రభుత్వం ఈ ఆరోపణలకు ఎలా స్పందిస్తుందో చూడాల్సి ఉంది. అమెరికా వాణిజ్య ఒప్పందం అంశం రాబోయే రోజుల్లో పార్లమెంట్‌తో పాటు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీసే అవకాశముంది.




## ఆ వెయ్యి కోట్లు ఎక్కడ్నించి తెచ్చావు?

మొదటిపేజీ తరువాయి

ఉన్న చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను పరామర్శించిన అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు.
ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజా సమస్యలపై కాకుండా, రేవంత్ రెడ్డి గాంధీ కుటుంబానికి సమర్పించుకుంటున్న వేల కోట్ల రూపాయల గురించే చర్చ జరుగుతోందని కేటీఆర్ ఆరోపించారు. రెండేళ్ల కాలంలోనే ఢిల్లీకి ఇచ్చేందుకు ముఖ్యమంత్రి వద్ద వెయ్యి కోట్లు సిద్ధంగా ఉన్నాయంటే, రాష్ట్ర ప్రజల సొమ్మును ఇంకెన్ని వేల కోట్లు మింగేశారో అర్థం చేసుకోవాలని అన్నారు. "ఆ వెయ్యి కోట్లు నీ అయ్యా సొమ్మా? లేక నీ అబ్బ సొమ్మా? ఎక్కడి నుంచి తెచ్చావు?" అని ముఖ్యమంత్రిని ఉద్దేశించి కేటీఆర్ ఘాటుగా ప్రశ్నించారు. ప్రజల కష్టార్జితాన్ని దోచుకుని గాంధీ కుటుంబానికి కప్పం కడతారా అంటూ మండిపడ్డారు.
రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అగాధంలోకి నెట్టిందని కేటీఆర్ విమర్శించారు. కేసీఆర్ హయాంలో డిసెంబర్‌లోనే రైతుల ఖాతాల్లో చేరే రైతుబంధు నిధులు, మార్చి నెల వచ్చినా ఇప్పటికీ అందించలేకపోయారని ఎద్దేవా చేశారు. రైతుబంధు ఇచ్చే తెలివి, రుణమాఫీ చేసే చిత్తశుద్ధి ఈ ప్రభుత్వానికి లేవని దుయ్యబట్టారు. కనీసం రైతులు పండించిన జొన్న, పత్తి పంటలను కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో ప్రభుత్వం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిపోయిన చరిత్ర రేవంత్ రెడ్డిదని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఇంత బాహాటంగా అవినీతికి పాల్పడుతుంటే ఈడీ, సీబీఐ, ఐటీ వంటి కేంద్ర దర్యాప్తు సంస్థలు ఏం చేస్తున్నాయని ఆయన నిలదీశారు.

## సేవా తీర్థ్‌లో తొలి కేబినెట్ భేటీ...

మొదటిపేజీ తరువాయి



ఒకటిగా నిలబెట్టడమే లక్ష్యంగా 'సేవా సంకల్ప్' పేరిట ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది.
నేడు 'సేవా తీర్థ్' ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశం దేశ ప్రగతి ప్రయాణంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది అని కేబినెట్ అభివర్ణించింది. వలసవాద గతం నుంచి ఆత్మవిశ్వాసంతో కూడిన నవ భారతం వైపు సాగుతున్న ప్రయాణానికి ఈ నూతన పరిపాలనా కేంద్రం ఒక శక్తివంతమైన చిహ్నమని తీర్మానంలో పేర్కొన్నారు. 'సేవా తీర్థ్' అనే పేరు సేవ, బాధ్యత, అంకితభావాలకు ప్రతిరూపమని, ఇక్కడ పరిపాలనను ఒక పవిత్ర యాత్రగా భావిస్తామని వివరించారు. ఈ సమావేశంపై ప్రధాని మోదీ ట్వీట్ చేస్తూ.. "స్వదేశీ ఆలోచన, ఆధునిక దృక్పథం, 140 కోట్ల ప్రజల అపార సామర్థ్యంతో భారత దేశాన్ని మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు సంకల్పం చేశాం" అని తెలిపారు.
ఈ సమావేశంలో తీసుకున్న ముఖ్య నిర్ణయాల్లో భాగంగా, బాలికల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ దేశవ్యాప్తంగా 14 ఏళ్ల బాలికలకు ఉచితంగా గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నిరోధక (హెచ్‌పీవీ) 'గర్దాసిల్' టీకాను అందించే కార్యక్రమానికి పచ్చజెండా ఊపారు. అదేవిధంగా, కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చే ప్రతిపాదనను కూడా కేబినెట్ ఆమోదించింది.
మౌలిక సదుపాయాల కల్పనకు ఊతమిస్తూ సుమారు రూ.12,236 కోట్ల విలువైన ప్రాజెక్టులకు కేంద్ర మంత్రివర్గం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అహ్మదాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్టు, జబల్‌పూర్ రైల్వే లైన్ డబ్లింగ్ పనులు ఉన్నాయి. వీటితో పాటు దేశవ్యాప్తంగా విద్యుత్ సరఫరా వ్యవస్థను బలోపేతం చేసే సంస్కరణలకు కూడా ఆమోదం లభించింది.
ప్రభుత్వ పరిపాలన అధికార కేంద్రంగా కాకుండా, ప్రజల సాధికారతకు కేంద్రంగా పనిచేయాలని 'సేవా సంకల్ప్' తీర్మానంలో స్పష్టం చేశారు. 'నాగరిక దేవో భవ' (పౌరుడే దైవం) అనే సూత్రాన్ని పాటిస్తూ, ప్రతి నిర్ణయం 140 కోట్ల ప్రజల సేవకే అంకితమవుతుందని పేర్కొన్నారు. గత దశాబ్దంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకురావడాన్ని గుర్తుచేస్తూ.. 'రిఫార్మ్ ఎక్స్‌ప్రెస్' వేగంతో భారత్‌ను త్వరలోనే ప్రపంచంలోని టాప్3 ఆర్థిక శక్తిగా నిలబెట్టేందుకు దృఢ సంకల్పం తీసుకున్నట్లు తెలిపారు. మొత్తం మీద, ఈ సమావేశం 2047 నాటికి 'వికసిత భారత్' లక్ష్యాన్ని సాధించే దిశగా ఒక బలమైన పునాది వేసిందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## కేరళ ఇకపై కేరళం..

- **కేరళ పేరును 'కేరళం'గా మార్చేందుకు కేంద్రం ఆమోదం**
- **కేరళ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానానికి కేంద్ర కేబినెట్ గ్రీన్ సిగ్నల్**
- **మలయాళ ఉచ్చారణకు అనుగుణంగా పేరు మార్పు ప్రతిపాదన**
- **రాజ్యాంగ సవరణ ద్వారా అధికారికంగా మారనున్న పేరు**

**తిరువనంతపురం, (డిడి9 వార్త):**

కేరళ రాష్ట్రం పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. ఈ మేరకు కేరళ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన మంగళవారం సమావేశమైన కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో కేరళ ప్రజల చిరకాల డిమాండ్ నెరవేరనుంది.
మలయాళ భాషలో కేరళ రాష్ట్రాన్ని 'కేరళం' అనే పిలుస్తారు. ఈ స్థానిక ఉచ్చారణకు అనుగుణంగా అధికారిక పేరును కూడా మార్చాలని కోరుతూ ముఖ్యమంత్రి పినరయి విజయన్ నేతృత్వంలోని ప్రభుత్వం 2024 జూన్ 24న శాసనసభలో ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపింది. ఈ ప్రతిపాదనకే ఇప్పుడు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. గతంలో 2023లోనూ ఇలాంటి తీర్మానం చేసిన విషయం తెలిసిందే.
కేంద్ర మంత్రివర్గం ఆమోదం తర్వాత ఈ ప్రక్రియ మరో దశకు చేరుతుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 3 ప్రకారం, రాష్ట్రపతి 'కేరళ (పేరు మార్పు) బిల్లు, 2026'ను రాష్ట్ర శాసనసభ అభిప్రాయం కోసం పంపుతారు. అక్కడి నుంచి ఆమోదం లభించాక, ఈ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడతారు. పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాజ్యాంగ సవరణ ద్వారా పేరు మార్పు అధికారికంగా అమల్లోకి వస్తుంది.



వచ్చే ఏప్రిల్-మే నెలల్లో కేరళ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ నిర్ణయం వెలువడటం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. గతంలో ఒరిస్సాను 'ఒడిశా'గా, పాండిచ్చేరిని 'పుదుచ్చేరి'గా మార్చిన తరహాలోనే ఇప్పుడు కేరళ పేరు కూడా మారుతోంది.

## RTI సమాచార హక్కు రక్షణ చట్టం 2005 బోథ్ నియోజకవర్గ అధ్యక్షులుగా సత్యరాజ్ నియామకం

**డిడి9 వార్త**

సమాచార హక్కు రక్షణ చట్టం 2005 బోథ్ నియోజకవర్గ అధ్యక్షులుగా గుడిహత్నూర్ మండలానికి చెందిన ఉపారపు సత్యరాజ్ నియమితులయ్యారు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు శ్రీ కొండగర్ల కమలాకర్ జిల్లా మరియు బోథ్ నియోజకవర్గ నూతన కమిటీని నియమించారు.ఈ సందర్భంగా సత్యరాజ్ మాట్లాడుతూ.. ప్రభుత్వంలో అవినీతి, అక్రమాలు రూపు మపాడానికి సమాచార హక్కు చట్టం ప్రజలకు బలమైన ఆయుధమని, సమాచార హక్కు చట్టం పై నియోజకవర్గం లోని అన్ని మండలాల్లో అవగహన సదస్సులు ఏర్పాటు చేస్తామని సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకుంటే సమాజంలో పారదర్శత నెలకొంటుందని అవినీతి అక్రమాలను వెలికి తీసి న్యాయ స్థానాల ద్వారా అరికట్టడమే కాకుండా నిరుపేదలకు న్యాయ సలహా, సేవలు అందించడం సమాచార హక్కు రక్షణ చట్టం ప్రధాన లక్ష్యమని ఆయన అన్నారు కాగా నాపై నమ్మకంతో నియోజకవర్గ అధ్యక్షులుగా నన్ను నియమించిన రాష్ట్ర కమిటీ అధ్యక్షులు కమలాకర్ గారికి జిల్లా అధ్యక్షులు వర్ని సంతోష్ గారికి కృతజ్ఞతలు తెలిపారు.



## సోనాల రైతు వేదికలో జాతీయ సహజ వ్యవసాయంపై అవగాహన సదస్సు

- **మండల వ్యవసాయ అధికారి .గుగులోతు దేవా**

**బోథ్, ఫిబ్రవరి 24(డిడి 9 వార్త ) :-**

సోనాల రైతు వేదికలో మంగళవారం రోజున రైతులకు మరియు సహజ వ్యవసాయ రైతులకి మండల వ్యవసాయ శాఖ.ఆధ్వర్యంలో జాతీయ సహజ వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సహజ వ్యవసాయం గురించి మండల వ్యవసాయ అధికారి గుగులోతు దేవా. మాట్లాడుతూ సహజ వ్యవసాయ పద్ధతి ద్వారా భూమి సహజ గుణాన్ని పెంపొందించి రసాయనిక ఎరువులు, పురుగుమందుల వినియోగం తగ్గించి సహజ ఎరువులు ,కాషాయాలు వంటి వాటిని గ్రామంలోని తయారు చేసుకుని, రైతులు తక్కువ పెట్టుబడి ఎక్కువ దిగుబడుల తో పాటు భూమి లో సూక్ష్మజీవులు,వానపాములు ,సేంద్రియ కర్బనం వంటివి పెరిగి భూమి ఆరోగ్యానికి మంచి జరుగుతుందని సేంద్రియ



ఎరువులు తయారు చేయడానికి. మహిళా సంఘాల వారికి అవకాశం కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఈ ఓ ఉమా మరియు కృషిసఖిలు మరియు రైతులు పాల్గొన్నారు.

# కోడిచెర్లలో గాలివాన బీభత్సం





- చేతికొచ్చిన పంట నేలపాలు..
- ఆవేదనలో అన్నదాత
- ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని కన్నీరు

**పొతంగల్ , నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

ఆరుగాలం శ్రమించి, అప్పులు తెచ్చి సాగు చేసిన పంట కళ్లముందే నేలపాలవడంతో అన్నదాతలు గుండెపగిలి రోదిస్తున్నారు. పొతంగల్ మండలంలోని కోడిచెర్ల గ్రామంలో గత రెండు రోజులుగా వీస్తున్న భీకర గాలులకు మొక్కజొన్న పంట పూర్తిగా నేలకొరిగింది. కోతకు సిద్ధంగా ఉన్న తరుణంలో ప్రకృతి పగబట్టడంతో రైతు పరిస్థితి మునుగుతున్న నక్కపై తాటికాయ పడ్డట్టు తయారైంది. గత వర్షాకాలంలోనూ ఇదే రీతిన పంట దెబ్బతినగా సర్కారు నుంచి నష్టపరిహారం అందలేదని రైతులు వాపోతున్నారు. అప్పులు చేసి పెట్టుబడులు పెడితే, చివరికి చేతికి చిప్పే మిగిలిందని కన్నీటిపర్యంతమవుతున్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న రేవంత్ సర్కార్.. తమ ఊసే ఎత్తడం లేదని, కనీసం రైతుబంధు సాయం కూడా అందకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నామని రైతులు బిర్లా వీరేశం, కేశవ్, పర్స పీరుగొండ, బాలుగొండ, కౌలు రైతు సుంకిని మనెయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరీత్యంతో నష్టపోయిన తమను ప్రభుత్వం తక్షణమే ఆదుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని హెచ్చరిస్తున్నారు. బాధిత రైతుల పొలాలను వ్యవసాయ విస్తరణాధికారి సుప్రియ మంగళవారం సందర్శించారు. నేలకొరిగిన పంటను చూసి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతుల వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారికి న్యాయంజరిగేలాచూస్తామనిఆమె పేర్కొన్నారు.

# 'ఆంద్ 'తెగ గిరిజన బిడ్డకే ఐటీడీఏ చైర్మన్ పదవికట్ట బెట్టాలి.

- కాంగ్రెస్ తరపున డిమాండ్.
- బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జల్కే పాండురంగ్‌కు పలువురి మద్దతు

**బజార్ హత్నూర్, ఫిబ్రవరి, 24 (డిడి 9న్యూస్ ):-**

ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ చైర్మన్ పదవి అంశం రాజకీయ వర్గాల్లోచర్చనీయాంశంగా మారింది. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కీలకమైన ఈ పదవిని ఒక ఆదివాసీ ఆంధ్ తెగ బిడ్డకే కేటాయించాలనే డిమాండ్ బలపడుతోంది. ఈ నేపథ్యంలో బజార్ హత్నూర్ మండల కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ జల్కే పాండురంగ్ పేరు వినబడుతోంది. కాంగ్రెస్ పార్టీ నుంచి ఆయనకు పలువురి మద్దతు లభిస్తోంది.నాయకులు బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆడే గజేందర్కు మంగళవారం పాండురంగ్ ఆయన అనుచరులతో కల్సి ఒక వినతిపత్రం ఇచ్చారు.ఈ సందర్భంగా జల్కే పాండురంగ్ ఆదివాసీ ఆంధ్ తెగ కుటుంబానికి చెందిన వారు. రాజకీయం గా అపారమైన అనుభవం ఉంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో వై ఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో బజార్హత్నూర్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్గా, బజార్హత్నూర్ ఎంపీటీసీగా పని చేసి ప్రజలకు సేవలు అందించారు.గిరిజనులతోమమేకమై వారిసమస్యలు,జీవనవిధానం,తెలుసుకొని ఆపద సమయం లో అండగా నిల్చున్న వ్యక్తిగాపేరుంది.కష్టనష్టాలు ,అడవి హక్కులు,భూమిసమస్యలు, ఉపాధి, విద్య, ఆరోగ్యరంగాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అర్థం చేసుకుని పరిష్కారము కోసం కృషి చేశారు.కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలోనూ కాంగ్రెస్ జెండాను భుజాన వేసుకుని గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేసిన నాయకుడుజల్కేపాండురంగ్ అనిమద్దతుగా నిలిచిన పార్టీ కార్యకర్తలుఅభిప్రాయంలు వ్యక్తంచేస్తున్నారు.రాజకీయ లాభనష్టాలు పక్కనపెట్టి గిరిజనుల హక్కుల కోసం పోరాడిన ఆయనకు ఐటీడీఏ చైర్మన్ పదవి ఇస్తే నిజమైన న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు.ఐటీడీఏ చైర్మన్ పదవి కేవలం రాజకీయ నియామకం కాదని,గిరిజన ప్రాంతాల అభివృద్ధికి దిశానిర్దేశం చేసే బాధ్యత అని తెలిపారు. ఒక ఆదివాసీ బిడ్డ చేతుల్లో ఈ బాధ్యత ఉంటే ప్రభుత్వ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతాయని, గిరిజనుల విశ్వాసం. ఆదివాసీ కుల సంఘాల 9తెగలకు మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నాయకత్వం వహించారాయన.ఈ మేరకు వినతి పత్రాన్ని స్వీకరించిన ఆడే గజేందర్ విషయాన్ని ఉన్నత నాయకత్వ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు సమాచారం. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.





# రోడ్డు భద్రతపై విద్యార్థులే వారధులు కావాలి : సీపీ సాయి చైతన్య

- సురక్షిత ప్రయాణం.. అందరి లక్ష్యం
- ఘనంగా అరైవ్ ఆలైవ్ అవగాహన వారోత్సవాలు

**నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

రహదారిపై ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకూడదన్నదే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయిచైతన్య పేర్కొన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అరైవ్ ఆలైవ్ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని విజయ హై స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదం జరిగితే కేవలం ఒక వ్యక్తి మాత్రమే కాదని ఆ కుటుంబమంతా రోడ్డున పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు చిన్నతనం నుంచే సామాజిక అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు రోడ్డు భద్రతకు రాయబారులుగా మారి తమ తల్లిదండ్రులు, ఇరుగుపొరుగు వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించేలా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టవిరుద్ధమని, నిబంధనలు పాటించడం ద్వారానే ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకుని, క్రమశిక్షణతో సమాజంలో మంచి స్థాయిలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ మస్తాన్ అలీ, ఎస్.హెచ్.ఓ పి.ప్రసాద్, ఐరాడ్ మేనేజర్ వర్షా నిహంత్, పాఠశాల ప్రిన్సిపాల్ ప్రభాదేవి, ఉపాధ్యాయులు సుజాత, వసంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



# నిజామాబాద్ ఎంపీ అరవింద్‌కు అంతర్జాతీయ స్థాయిలో కీలక బాధ్యత

**నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు ధర్మపురి అరవింద్‌కు అంతర్జాతీయ దౌత్య విభాగంలో అరుదైన గౌరవం దక్కింది. ప్రపంచ దేశాలతో భారత పార్లమెంటరీ సంబంధాలను మరింత పటిష్టం చేసేందుకు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా ఏర్పాటు చేసిన పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూపుల్లో భాగంగా.. భారత్‌ఉక్రెయిన్ స్నేహ బృందానికి గ్రూప్ లీడర్‌గా అరవింద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కీలకమైన బాధ్యతను తనకు అప్పగించినందుకు ఎంపీ అరవింద్ హర్షం వ్యక్తం చేస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, స్పీకర్ ఓం బిర్లా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్లమెంటరీ ఫ్రెండ్‌షిప్ గ్రూపులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న దేశాలతో భారతదేశ నిశ్చితార్థాన్ని బలోపేతం చేయడానికి ఒక అర్థవంతమైన చొరవ అని అభిప్రాయపడ్డారు. ఈ వేదిక ద్వారా ఇరు దేశాల పార్లమెంటు సభ్యులు నేరుగా సంభాషించుకోవడానికి, శాసనపరమైన అనుభవాలను మార్పిడి చేసుకోవడానికి వీలవుతుందని పేర్కొన్నారు. కేవలం పార్లమెంటరీ వ్యవహారాలకే పరిమితం కాకుండా వాణిజ్యం, సాంకేతికత, సంస్కృతి మరియు ఉమ్మడి ప్రపంచ సవాళ్లు వంటి రంగాల్లో సహకారాన్ని విస్తరించడానికి ఇవి ఎంతగానో తోడ్పడతాయని, అదే సమయంలో ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.




# రోడ్డుపై బాధ్యతగా వెళ్లండి క్షేమంగా ఇంటికి తిరిగి రండి

- జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపిఎస్
- అరైవ్ అలైవ్ 2.0"లో భాగంగా 250 మంది డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు

**డిడి9 వార్త గుడిహత్నూర్**

జిల్లా వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు రాష్ట్ర డిజిపి డి శివధర్ రెడ్డి చే ప్రారంభించబడిన "అరైవ్ అలైవ్ 2.0" కార్యక్రమం సందర్భంగా ఈరోజు ఉదయం గుడిహత్నూర్ మండలంలోని మన్నూరు గ్రామం నందు గల "ఎస్ కన్వెన్షన్" హాల్ లో జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లకు ఉచితంగా కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డిఫెన్సివ్ డ్రైవింగ్ తో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చని, ప్రతి ఒక్కరూ వాహన నియమ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలలో ప్రాణనష్టాన్ని తగ్గించవచ్చని తెలిపారు. మంచి కంటి చూపుతో ప్రమాదాల నివారణ సాధ్యం అని తెలిపారు. ప్రతి ఒక్క ఆటో యజమాని "అభయ మై టాక్సీ ఇస్ సేఫ్" అనే కార్యక్రమంలో పాలు పంచుకోవాలని, దీని ద్వారా లక్ష రూపాయల ప్రమాద బీమా కల్పిస్తుందని తెలిపారు. డ్రైవర్లకు ఎలాంటి అనుమానాస్పద సమాచారం ఉన్న వెంటనే డయల్ 100 ద్వారా పోలీసులకు సమాచారం చేరవేయాలని తెలిపారు. ఈ ఉచిత కంటి పరీక్ష లో తెలంగాణ, ఆంధ్ర ప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలకు చెందిన లారీ డ్రైవర్లు, మరియు జిల్లాలోని నేరెడిగొండ,గుడిహత్నూర్, ఇచ్చోడ మండలాలకు చెందిన 250 మంది ఆటో, టాక్సీ, లారీ డ్రైవర్లు పాల్గొన్నట్లు తెలిపారు. వీరందరికీ ఆదిలాబాద్ లోని నిష్ణాతుడైన వైద్యులు డాక్టర్ కృష్ణ ప్రసాద్ చే వైద్య పరీక్షలను నిర్వహించినట్లు, జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా పరీక్షలను పరిశీలించి, నిరుపేద 40 మంది డ్రైవర్లకు ఉచితంగా కంటి అద్దాలను ఇచ్చారు. ముఖ్యంగా ఆటోలలో టాక్సీలలో అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా, నిషేధిత పదార్థాలను, వస్తువులను, వాటిని రవాణా చేయకుండా ఉండాలని తెలిపారు. డ్రైవర్లు ఎట్టి పరిస్థితుల్లోనూ డ్రంక్ అండ్ డ్రైవ్ చేయవద్దని డ్రంక్ డ్రైవ్ చేసిన వాహనాలను సీజ్ చేయబడతాయని తెలియజేశారు. అదేవిధంగా పరిమితికి మించి ప్రయాణికులతో నడుపుతున్న వాహనాలపై, ఆటోల పై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడతాయన్నారు. ఆటోలు, వాహనాల ద్వారా నేరాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐలు సిహెచ్ రమేష్, బండారి రాజు, ఎస్ఐ లు ఇమ్రాన్, శ్రీకాంత్ అసోసియేషన్ అధ్యక్షుడు పెంచాల వెంకటేశ్వర్లు, పోలీసు డాక్టర్ శాంతరాజ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పొతంగల్ లో వార్డు సభ్యులకు విధులపై అవగాహన

**పొతంగల్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తమ విధులను, బాధ్యతలను పూర్తిస్థాయిలో అర్థం చేసుకున్నప్పుడే గ్రామాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీవో చందర్ అన్నారు. మంగళవారం పోతంగల్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రెండో విడత వార్డు సభ్యుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పంచాయతీరాజ్ చట్టంపై ప్రతి ప్రతినిధికి కనీస అవగాహన ఉండాలని సూచించారు. గ్రామ సమస్యల పరిష్కారంలో వార్డు సభ్యుల పాత్ర కీలకమని, ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను చేరవేయడంలో వారు నిరంతరం శ్రమించాలని కోరారు. ఐదు రోజుల పాటు సాగే ఈ శిక్షణలో పంచాయతీ నిధులు, విధులు, గ్రామ సభల నిర్వహణ వంటి అంశాలపై సమగ్రంగా వివరించనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణా శిబిరంలో ట్రైనర్లు ప్రవీణ్ కుమార్, రాజశేఖర్, నాగరాజు, శ్రవణ్ కుమార్ పాల్గొని సభ్యులకు సందేహ నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని వివిధ గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.




# పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రి పంపిణీ

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, గురువులు, తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని లయన్స్ క్లబ్ ఆఫ్ భవానీ ఆదర్శ్ చైర్మన్ పావులూరి వెంకటేశ్వర రావు ఆకాంక్షించారు. మంగళవారం సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని పంపిణీ చేశారు. వెంకటేశ్వరరావు తన తల్లిదండ్రులు పావులూరి ఆదెమ్మ, నాగయ్యల జ్ఞాపకార్థం విద్యార్థులకు సర్టిఫికెట్ ఫోల్డర్లు, పెన్నులు, స్కేళ్లు, పెన్సిళ్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర మరువలేనిదని, పరీక్షలకు సమయత్తమయ్యే వేళ ఏకాగ్రతతో చదివి పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి లక్ష్మీకాంతం, సభ్యులు రెడ్డిమాను వెంకటేశ్వరరావు, రవి, రామారావు, సుబ్బారావు పాల్గొన్నారు. పాఠశాల ఇన్చార్జ్ ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్, ఉపాధ్యాయులు శోభారాణి, విజయలక్ష్మి, జ్యోత్స్న, రాజ్‌కుమార్, సంతోష్ యాదవ్, స్వామి కామని, విట్టల్ కాంబ్లే, అబ్బయ్య, మహేష్, వనజ, అంజన, అక్షయ్ కుమార్ జాదవ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.





## సాలూర మండల సర్పంచుల ఫోరం ఎన్నిక

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

సాలూర మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో జరిగిన సర్పంచుల సమావేశంలో అందరి ఆమోదంతో నూతన బాధ్యులను ప్రకటించారు. ఫోరం అధ్యక్షునిగా కొప్పర్తి క్యాంపు సర్పంచ్ మేదరమెట్ల సతీశ్, ఉపాధ్యక్షుడిగా ఫతేపూర్ సర్పంచ్ షేక్ నూర్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా సాలూర క్యాంపు సర్పంచ్ దొండేటి భాస్కర్ రెడ్డిలను నియమించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ మండలంలోని గ్రామ పంచాయతీల సమస్యల పరిష్కారానికి, సర్పంచులందరి సమన్వయంతో అభివృద్ధి పనుల వేగవంతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. తమపై నమ్మకంతో ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు మండలంలోని సర్పంచులందరికీ వారు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికీ ఐదు రోజుల శిక్ష

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

మద్యం మత్తులో వాహనాలు నడిపి నిబంధనలు ఉల్లంఘించే వారిపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. బోధన్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఒక వ్యక్తికి కోర్టు ఐదు రోజుల జైలు శిక్ష విధించింది. పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గాంధీనగర్ కాలనీకి చెందిన షేక్ షబ్బీర్ మద్యం తాగి వాహనం నడుపుతుండగా పోలీసులు పట్టుకుని కేసు నమోదు చేశారు. నిందితుడిని మంగళవారం స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శేష తల్ప సాయి ఎదుట హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయమూర్తి నేరం నిరూపణ కావడంతో షబ్బీర్‌కు ఐదు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ప్రాణాలకు ముప్పు తెచ్చే డ్రంకెన్ డ్రైవ్ విషయంలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మద్యం తాగి వాహనాలు నడిపి జైలు పాలు కావద్దని ఆయన హెచ్చరించారు.

## జిల్లాలో శాంతిభద్రతలు క్షీణించాయి : బీజేపీ ఆగ్రహం

**నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**




జిల్లాలో హిందువులపై వరుస దాడులు జరుగుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేశ్ కులాచారి ఆరోపించారు. మంగళవారం నిజామాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... జిల్లాలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని ధ్వజమెత్తారు. ఇటీవల బాన్సువాడలోని ఒక మార్ట్‌లో మహిళపై జరిగిన దాడి ఘటన మరువకముందే, రుద్రూర్‌లో మహిళా న్యాయవాదిపై దుండగులు అమానుషంగా దాడికి పాల్పడటం పోలీసుల వైఫల్యానికి నిదర్శనమన్నారు. నగరంలో బీజేపీ నాయకుడు సురేశ్ కేవలం పాటలు పెట్టుకున్నాడన్న సాకుతో అల్లరి మూకలు దాడులకు తెగబడ్డాయని ఆయన విమర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అల్లరి మూకలపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆయన డిమాండ్ చేశారు.



## ఎడపల్లిలో వైభవంగా నల్ల పోచమ్మ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండల కేంద్రంలోని నయాబాదిలో వెలసిన నల్ల పోచమ్మ ఆలయ నూతన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో, గ్రామస్తులందరి సహకారంతో ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజున మహిళలు ఆలయ ఆవరణలో ప్రత్యేక కుంకుమార్చన పూజలు నిర్వహించి, అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పసుపు, కుంకుమ మరియు జలాభిషేకాలు చేశారు. భక్తజనుల కోలాహలం మధ్య దంపతులు శాస్త్రోక్తంగా యజ్ఞ కార్యక్రమాలను నిర్వహించారు. వచ్చే గురువారం అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన ప్రధాన ఘట్టం ఉంటుందని గ్రామ పెద్దలు వెల్లడించారు. ఈ వేడుకల సందర్భంగా ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మూడు రోజుల పాటు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశామని, మొదటి రోజైన మంగళవారం భారీగా అన్నప్రసాద వితరణ జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులు, యువకులు, మహిళలు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.



# పసిపాప మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి





**నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మరి మల్లన్న జాతరలో రజక దంపతులపై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మృతికి నిరసనగా నిజామాబాద్ నగరం నిరసన జ్వాలలతో హోరెత్తింది. మంగళవారం వివిధ బీసీ కుల సంఘాలు, ఎస్సీ, ఎస్టీ జేఏసీ, భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి, ధర్నా చౌక్ వద్ద మానవహారంగా ఏర్పడి రోడ్డుపై బైఠాయించారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ మాట్లాడుతూ.. రజక కుటుంబంపై దాడి మానవజాతి చరిత్రలోనే అత్యంత హేయమైన సంఘటన అని అభివర్ణించారు. గణేష్ దంపతులను నాలుగు గంటల పాటు గదిలో నిర్బంధించి హింసించడం వల్లనే పసిపాప ప్రాణాలు కోల్పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నిందితులైన శ్రీనివాస్ రెడ్డి, మధు రెడ్డి, తుకారం రెడ్డిలను వెంటనే అరెస్టు చేసి ప్రత్యేక కోర్టు ద్వారా త్వరితగతిన శిక్ష పడేలా చూడాలని డిమాండ్ చేశారు. రజక ఐక్యవేదిక నాయకులు గూపన్‌పల్లి శంకర్ మాట్లాడుతూ.. ఇది కేవలం ఒక కులంపై జరిగిన దాడి కాదని, యావత్ బడుగు బలహీన వర్గాల అస్తిత్వంపై జరిగిన దాడి అని పేర్కొన్నారు. బాధితులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆపేది లేదని రజక సంఘం నగర అధ్యక్షుడు సాయిలు స్పష్టం చేశారు. అడవి మృగాలకు ఉన్న జాలి కూడా అగ్రవర్ణ పెత్తందార్లకు లేకుండా పోయిందని, పసిబిడ్డను కాలితో నలిపి చంపడం దారుణం అని జేఏసీ రాష్ట్ర కార్యదర్శి సుమన్ మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బుస్స ఆంజనేయులు, భిక్షపతి, ప్రభాకర్, పోల్కం గంగ కిషన్, దర్శనం దేవేందర్, కొయ్యాడ శంకర్, బగ్గలి అజయ్, సాయి బసవ, చంద్రకాంత్, రేఖ, భూమేష్, భూమన్న, వాసం జయ, ప్రేమ్ కుమార్, మహిపాల్, బాలన్న, సురేందర్, గంగాధర్, శ్రీనివాస్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.



## ఎడపల్లి లో వార్డు సభ్యులకు నిధులు, విధులపై అవగాహన

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో మంగళవారం మండలంలోని 17 గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు శిక్షణ తరగతులు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శంకర్ నాయక్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మొత్తం 166 మంది వార్డు సభ్యులు ఉన్నారని, అందులో భాగంగా మొదటి విడతలో 84మంది సభ్యులకు పంచాయతీ నిధులు, విధులపై పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 24 నుండి 28వ తేదీ వరకు మొదటి విడత శిక్షణ కొనసాగుతుందని, అనంతరం రెండవ విడత శిక్షణ మార్చి 2వ తేదీ నుండి మార్చి 7వ తేదీ వరకు ఐదు రోజుల పాటు నిర్వహిస్తామని ఆయన వివరించారు. ఈ శిక్షణలో భాగంగా టీఓటీ శిక్షకులు నూతన పంచాయతీ రాజ్ చట్టం2018లోని ముఖ్యాంశాలను సభ్యులకు క్లుప్తంగా వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా గ్రామ పంచాయతీలకు మంజూరయ్యే నిధులను గ్రామ అభివృద్ధి కొరకు ఎలా వినియోగించాలో, పంచాయతీ విధులపై వార్డు సభ్యులు ఎలాంటి అవగాహన కలిగి ఉండాలో నిపుణులు బోధించారు. వార్డుల్లోని సమస్యలను ముందస్తుగా గుర్తించి, వాటిని పంచాయతీ నిధుల ద్వారా పరిష్కరించుకునే మార్గాలను సభ్యులకు సూచించారు. ముఖ్యంగా రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి ఎద్దడి తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సభ్యులకు ఎంపీడీవో దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ మన్మోహన్ శాస్త్రి, శిక్షకులు మల్లెల క్యాతప్ప, ఈశ్వర్, శ్రీనివాస్, రామకృష్ణయ్యతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించిన తర్వాతే మిగతా పనులు చేపట్టాలి.

- **లేనిపక్షంలో ఎంపీడీవో కార్యాలయం ముట్టడిస్తాం..**
- **సీపీఐ కార్యవర్గ సభ్యులు ఎం. రమేష్ బాబు..**

**జూపాడుబంగ్లా (డీడీ9 వార్త):**

జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించకుండా ఇతర పనులకు ప్రాధాన్యమిస్తూ ఉపాధి కూలీల వలసలకు అధికారులు కారణమవుతున్నారని ముందుగా ఉపాధి కూలీలకు పనులు కల్పించిన తర్వాతే హైదరాబాద్ మిగతా పనులు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎం.రమేష్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయం దగ్గర సీపీఐ అధ్యర్యంలో ధర్నా నిర్వహించి ఏపీవో రేష్మ కి వినతి పత్రం అందించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఉపాధి లేక పూట గడవక అనేక ఇబ్బందులకు గురవుతున్నారని పనులు కల్పించాల్సిన అధికారులు మాత్రం ప్రభుత్వ నిబంధనలు అనుకూలించడం లేదణే సాకుతో ఎక్కడా కూడా ఉపాధి కల్పించడం లేదని జిల్లా వ్యాప్తంగా ప్రతి మండలంలో కనీసం 20 శాతం కూడా ఉపాధి పనులు కల్పించ లేదంటే కూలీల పట్ల అధికారులకు ఏమాత్రం ప్రేమ ఉందో అర్థం అవుతుంది అన్నారు. ఉపాధి కూలీలకు ఖర్చు చేయాల్సిన నిధులను ఇతర మెటీరియల్ పనులకు ఉపయోగిస్తున్నారని దీనివల్ల కూలీలకు ఉపాధి కరువు అవుతుందన్నారు. ఉపాధి కూలీల తర్వాతే ఏదైనా పనులు చేపట్టాలని లేనిపక్షంలో ఉపాధి కూలీలతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు మక్బూల్ బాషా, తిరుపతయ్య,పుల్లయ్య, నాగన్న, రాజు తదితరులు పాల్గొన్నారు..



## మహిళా న్యాయవాదిపై దాడి హేయమైన చర్య

- **విధులను బహిష్కరించిన న్యాయవాదులు**

**నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

బోధన్ బార్ అసోసియేషన్ సభ్యురాలు, మహిళా న్యాయవాది జి. కళ్యాణిపై రుద్రూర్ వద్ద జరిగిన దాడిని నిరసిస్తూ నిజామాబాద్ జిల్లా న్యాయవాదులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ దాడికి నిరసనగా మంగళవారం న్యాయవాదులందరూ విధులను బహిష్కరించి, కోర్టు ప్రాంగణం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాది పరిషత్ జిల్లా అధ్యక్షుడు జగన్మోహన్ గౌడ్ మాట్లాడుతూ.. సమాజానికి న్యాయం అందించే న్యాయవాదులపై ఇలాంటి దాడులు జరగడం దురదృష్టకరమని పేర్కొన్నారు. దాడి జరిగిన వెంటనే బాధితురాలు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసులు స్పందించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించారని ఆయన మండిపడ్డారు. మహిళా న్యాయవాదిపై దాడి చేసిన నిందితులను వెంటనే గుర్తించి అరెస్ట్ చేయాలని, నిందితులపై హత్యాయత్నం కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పోలీసులు తమ నిర్లక్ష్య వైఖరిని వీడి న్యాయవాదులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ నిరసనలో జిల్లాలోని పలువురు సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొని బాధితురాలికి మద్దతు ప్రకటించారు. న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆపబోమని వారు స్పష్టం చేశారు.



## కమ్యూనిస్టు పార్టీ వందేళ్ల సభను జయప్రదం చేయండి

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి :**

భూమి, భుక్తి, విముక్తి నినాదంతో ముందుకొచ్చిన కమ్యూనిస్టు పార్టీ తన వందేళ్ల ప్రయాణంలో ఎన్నో మహత్తర పోరాటాలు చేసిందని, దున్నే వానికే భూమి అనే విప్లవకర నినాదంతో రైతాంగ ఉద్యమాలను నడిపిందని సీపీఐ (యంయల్) న్యూడెమోక్రసీ పార్టీ బోధన్ డివిజన్ నాయకులు సూర్య విటల్, ఆర్. గౌతమ్ కుమార్ అన్నారు. ఈ నెల 27న హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న కమ్యూనిస్టు పార్టీ ప్రథమ మహాసభ వందేళ్ల ఉత్సవాల బహిరంగ సభ పోస్టర్లను మంగళవారం బోధన్ మండలం పెద్దమావంది గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1925లో భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి మొదటి మహాసభ జరుపుకున్న నాటి నుండి నేటికి వందేళ్లు పూర్తయ్యాయని గుర్తుచేశారు. దేశాన్ని బ్రిటిష్ వలస పాలకులు, ఫ్యూడల్ ప్రభువులు నిరంకుశంగా పాలిస్తున్న తరుణంలో ఎర్రజెండా ప్రజలకు అండగా నిలిచిందని, స్వాతంత్ర్యం మరియు స్వేచ్ఛ కోసం నినదించిందని పేర్కొన్నారు. సమాజ మౌలిక మార్పులో కీలకమైన భూమి సమస్యను అజెండాగా మార్చుకుని అసంఖ్యాక విజయాలు సాధించడమే కాకుండా, పారిశ్రామిక కేంద్రాల్లోని కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడిందని కొనియాడారు. తెలంగాణ ప్రాంతంలో కమ్యూనిస్టు పార్టీ నిషేధానికి గురైనప్పటికీ, ప్రపంచం మెచ్చదగిన భూ పోరాటాలు, ఆదివాసి, రైతాంగ, మహిళా ఉద్యమాలను సమరశీలంగా నడిపిందని వారు స్పష్టం చేశారు. ఆనాటి పోరాట త్యాగాల స్ఫూర్తితో నేడు దేశంలో సాగుతున్న మతోన్మాద, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. ఈ నెల 27న జరిగే సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జైరాం, లక్మణ్, సాయినాథ్, పోశెట్టి, ప్రకాష్, శివ పటేల్, గంగాధర్, లక్ష్మణ్ పటేల్, మోహన్, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



# న్యాయవాదిపై దాడి కేసును నీరుగారుస్తున్నారు





- **పోలీసుల తీరుపై బోధన్ బార్ అసోసియేషన్ ఆగ్రహం**

**బోధన్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

మహిళా న్యాయవాది జి.కళ్యాణిపై రుద్రూర్ వద్ద జరిగిన దాడి ఘటనను నిరసిస్తూ మంగళవారం బోధన్ న్యాయస్థాన న్యాయవాదులు సంఘం విధులను బహిష్కరించి, అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆ సంఘం ప్రతినిధులు రాములు, విద్యాసాగర్ లు మాట్లాడుతూ... బాధితురాలికి న్యాయం చేయాల్సిన రక్షక భటులే నిందితులకు రక్షణ కవచంగా మారడాన్ని తీవ్రంగా ఖండించారు. రుద్రూర్ పోలీసులు నిందితులకు కొమ్ముకాస్తూ కేసును బలహీనపరుస్తున్నారని న్యాయవాదులు ధ్వజమెత్తారు. బాధితురాలు ఇచ్చిన అసలైన ఫిర్యాదును కాదని, నిందితులకు అనుకూలంగా ఉండేలా ఒక కానిస్టేబుల్‌తో రెండవ ఫిర్యాదును రాయించి తక్కువ స్థాయి శిక్షలు పడే సెక్షన్లతో ప్రథమ సమాచార నివేదికను నమోదు చేయడంపై వారు మండిపడ్డారు. రుద్రూర్ ఎస్సై, అక్కడి రైటర్ వ్యవహరించిన తీరుపై తక్షణమే చట్టపరమైన విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం పోలీస్ స్టేషన్ లోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించి, ఆ రోజు బాధితురాలు అందజేసిన అసలైన ఫిర్యాదు ఆధారంగానే నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపాలని కోరారు. తమ పోరాటానికి మద్దతుగా విధులను బహిష్కరించిన నిజామాబాద్, కామారెడ్డి, బాన్సువాడ, బిచ్కుంద న్యాయవాదుల సంఘాలకు కృతజ్ఞతలు తెలిపారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునే వరకు వెనక్కి తగ్గేది లేదని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో నిజామాబాద్, బోధన్ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో పాటు అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



## గండివేట్ గ్రామపంచాయతీలో కుర్చీల వివాదం...

- **ఉపసర్పంచ్‌కు కుర్చీ నిరాకరణ? గ్రామంలో ఉద్రిక్తత**
- **దళితుడివి పక్కన కూర్చోవద్దు అంటూ వివాదం... గ్రామంలో టెంట్ వేసి ధర్నా**

**కామారెడ్డి, ఫిబ్రవరి 24(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లాలోని గండివేట్ గ్రామపంచాయతీలో కుర్చీ వ్యవహారం వివాదాస్పదంగా మారింది. ఇటీవల జరిగిన సర్పంచ్-ఉప సర్పంచ్ ఎన్నికల అనంతరం ఈ ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన కిష్టాపురం కాశీరాం ఉపసర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గతంలో కూడా ఆయన ఉపసర్పంచ్‌గా, వార్డు సభ్యుడిగా సేవలందించారు. అయితే, నూతనంగా ఎన్నికైన సర్పంచ్ అనూష-సంతోష్ ఉపసర్పంచ్ కుర్చీ తన పక్కన ఉండకూడదని, పక్కన కూర్చోరాదని చెప్పినట్లు కాశీరాం ఆరోపించారు. ఇది కుల వివక్షకు దారితీసే వ్యాఖ్యగా భావించి ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ విషయాన్ని సంబంధిత జిల్లా అధికారులకు ఉపసర్పంచ్ తెలియజేశారు. ఇదే సందర్భంలో డీఎల్పీఓ సురేందర్ ఫోన్‌లో మాట్లాడుతూ కుర్చీ వెంటనే తీసివేయాలని, లేదంటే పరిస్థితి బాగుండదని హెచ్చరించినట్లు సమాచారం. దీనిపై కూడా ఆగ్రహం వ్యక్తం చేసిన కాశీరాం, దళిత సంఘాల నాయకులను ఆశ్రయించారు.దీంతో కామారెడ్డి జిల్లాలోని పలు దళిత సంఘాల నాయకులు గ్రామానికి చేరుకొని గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట టెంట్ వేసి బైఠాయించారు. నేటి ఆధునిక యుగంలో కూడా కుల వివక్ష చూపడం హేయమని వారు మండిపడ్డారు. కళాకారులు పాటల రూపంలో అంబేద్కర్ వారసులమని ప్రకటిస్తూ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రూపకల్పన చేసిన భారత రాజ్యాంగం వల్లే షెడ్యూల్డ్ కులాలకు హక్కులు, రిజర్వేషన్లు లభించాయని గుర్తు చేశారు.మాదిగలు సహా దళిత వర్గాలు రాజ్యాంగ హక్కుల ద్వారానే విద్య, ఉద్యోగాల్లో ముందుకు వచ్చారని పలువురు పేర్కొన్నారు. గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటనపై వెంటనే సంబంధిత సర్పంచ్ భర్త క్షమాపణ చెప్పాలని, లేదంటే కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపడతామని హెచ్చరించారు. అక్కడ కూడా న్యాయం జరగకపోతే హెచ్ఆర్సీని ఆశ్రయిస్తామని తెలిపారు.ఈ వివాదానికి కారణమైన డీఎల్పీఓ సురేందర్‌పై శాఖాపరమైన, చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికారులు తక్షణమే జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ దళిత సంఘాల నాయకులు, మాజీ సర్పంచ్ ఫారూక్, తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు ఎర్రవట్టి సాయిబాబా, ఎంఎంఆర్పీఎస్ నాయకులు రుషేగాం భూమయ్య, దాకయ్య, సంజీవులు తదితరులు పాల్గొన్నారు.



## గండిపేట్ ఫ్రెండ్స్ యూత్ సేవలు అమోఘం... సేవలో మేటిగా ఆదర్శంగా నిలుస్తున్న యువత

**కామారెడ్డి, ఫిబ్రవరి 24(డిడి9 వార్త):**

కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని గాంధారి మండలంలోని గండిపేట్ గ్రామంలో ఫ్రెండ్స్ యూత్ ఆధ్వర్యంలో చేపడుతున్న సేవా కార్యక్రమాలు సర్వత్ర ప్రశంసలు అందుకుంటున్నాయి.గ్రామంలో స్వచ్ఛందంగా వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసి ఉచితంగా శుద్ధి చేసిన తాగునీటిని అందజేస్తుండటంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గత ఎన్నో ఏళ్లుగా వాటర్ ఫిల్టర్‌ను కొనసాగిస్తూ సేవా కార్యక్రమాలను విస్తరిస్తూ వస్తున్నామని యూత్ సభ్యులు తెలిపారు. గండిపేట్‌తో పాటు మేడిపల్లి, చెన్నాపూర్, గండిపేట్ తండా, సితాయపల్లి గ్రామాల ప్రజలకు కూడా ఉచితంగా నీటిని అందించడం విశేషం.సుమారు 30 మంది సభ్యులు నెలకు రూ.300 చొప్పున జమ చేసి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని యూత్ అధ్యక్షులు సంఘం రాజు తెలిపారు. ప్రారంభంలో తక్కువ మొత్తంతో సేవలు ప్రారంభించి, రానురాను ఉచిత నీటి పంపిణీ వంటి కార్యక్రమాలకు విస్తరించామని చెప్పారు. వేసవికాలంలో ఉచిత తాగునీరు అందించడం అభినందనీయమని పలువురు మేధావులు అభిప్రాయపడుతున్నారు. ఇక సేవా కార్యక్రమాల పరంగా మాత్రమే కాకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానాలు, పాఠశాల విద్యార్థులకు ఆటపోటీలు నిర్వహించి బహుమతులు అందజేయడం వంటి కార్యక్రమాలు కూడా చేపడుతున్నామని కార్యదర్శి జశ్వంత్ గౌడ్ తెలిపారు. అవసరమైన పేద కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించేందుకు కూడా సిద్ధంగా ఉంటామని యూత్ సభ్యులు వెల్లడించారు. అయితే ఉచితంగా నీటిని అందిస్తున్న నేపథ్యంలో గ్రామ సర్పంచ్ వాటర్ ప్లాంట్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో వాటర్ ప్లాంట్‌ను ప్రోత్సహించే ఉద్దేశంతో ఫ్రెండ్స్ యూత్ ప్లాంట్‌ను మూసివేయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్తులు విమర్శిస్తున్నారు. సేవలను అభినందించాల్సింది పోయి అడ్డంకులు సృష్టించడం సరికాదని వారు అభిప్రాయపడుతున్నారు.ఫ్రెండ్స్ యూత్ అధ్యక్షులు సంఘం రాజు, కార్యదర్శి జశ్వంత్ గౌడ్, ఉపాధ్యక్షులు రాజేందర్, సభ్యులు రవి, ప్రకాష్, యాసిన్ తదితరులు కలిసి గ్రామాభివృద్ధి, సేవా కార్యక్రమాల్లో ముందుండి పనిచేస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి గ్రామానికి ఆదర్శంగా నిలవాలని సంకల్పించారు.






## రామునికి రాక్షసులకు మధ్య జరుగుతున్న యుద్ధం

- రేవంత్ రెడ్డి నీ ఓడించినందుకే కామారెడ్డి ప్రజలపై కక్ష కట్టారు
- కొడంగల్ కి నిధులా ? కామారెడ్డికి గొడవలా ?
- కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదు
- బీజేపీ తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం
- ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి

**కామారెడ్డి, ఫిబ్రవరి 24(డిడి9 వార్త):**

కామారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడికి ప్రయత్నించిన ఘటనపై రాజకీయ వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఈ నేపథ్యంలో గత మూడు రోజులుగా గృహనిర్బంధంలో ఉన్న కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి కు మద్దతుగా ఆర్మూర్ శాసనసభ్యులు రాకేష్ రెడ్డి ఈ రోజు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాంపు



కార్యాలయంపై దాడులు అన్యాయం, అక్రమమని తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వం ప్రతిపక్ష ఎమ్మెల్యేల పట్ల ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపించారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తనను ఓడించినందుకే కామారెడ్డి ప్రజలపై కక్ష కట్టారని వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గానికి నిధులు కేటాయిస్తూ, కామారెడ్డికి మాత్రం వివాదాలు తెస్తున్నారని విమర్శించారు."ఇకపై ఇది రామునికి రాక్షసులకు మధ్య జరుగుతున్న యుద్ధంలా ఉంటుంది" అంటూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ఎందుకు నెరవేర్చలేదని ప్రశ్నించారు.తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పేర్కొంటూ, రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగరడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు.ఈ ఘటనపై రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది.

## పదో తరగతి పరీక్షల నిర్వహణపై కలెక్టర్ కసరత్తు

- **కేంద్రాల్లోకి సెల్ ఫోన్ల పై నిషేధం**

**నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి (డీడీ9 వార్త) :**

రాబోయే పదో తరగతి వార్షిక పరీక్షలను అత్యంత పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని చర్యలు చేపడుతోంది. మంగళవారం కలెక్టరేట్‌లో పరీక్షల ప్రధాన పర్యవేక్షకులు, విభాగపు అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. పరీక్షా కేంద్రాల లోపలికి విద్యార్థులతో పాటు పర్యవేక్షక అధికారులు సైతం సెల్ ఫోన్లు, అత్యాధునిక గడియారాలు, ఎలక్ట్రానిక్ పరికరాలను తీసుకురావడాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీ వంటి దుష్పరిణామాలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఒకవేళ ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా చరవాణులు తీసుకువస్తే, వాటిని కేంద్రం ప్రధాన ద్వారం వద్దనే స్వాధీనం చేసుకుని భద్రపరిచేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రశ్నపత్రాల తరలింపు సమయంలో తప్పనిసరిగా పోలీసు బందోబస్తు ఉండాలని, పరీక్షా సమయం ముగిసే వరకు కేంద్రం నుంచి ఏ ఒక్కరూ బయటకు వెళ్లకుండా చూడాలని సూచించారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగినన్ని గదులు, వెలుతురు, తాగునీటి సౌకర్యం కల్పించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. విద్యార్థులు పరీక్షా సమయానికి కనీసం ముప్పై నిమిషాల ముందే కేంద్రాలకు చేరుకోవాలని, దీనిపై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆధునిక సాగుతోనే అధిక లాభాలు

**పోతంగల్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**

వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు పాటించడం ద్వారా పెట్టుబడి తగ్గించుకుని అధిక లాభాలు పొందవచ్చని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ ప్రతినిధులు సూచించారు. మంగళవారం కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్, ఎతోండ గ్రామాల్లో రైతులకు నూతన సాగు పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ఏరియా మేనేజర్ అరుణ్ మాట్లాడుతూ.. వరి సాగులో సీడ్ కమ్ ఫెర్టిలైజర్ డ్రిల్, డ్రమ్ సీడర్ వంటి పరికరాల ద్వారా నేరుగా విత్తడం వల్ల కూలీల ఖర్చు ఎకరాకు సుమారు రూ. 8 వేల వరకు ఆదా అవుతుందన్నారు. అలాగే తడిపొడి పద్ధతిలో నీటి యాజమాన్యం, జీరో టిలేజ్ ద్వారా మొక్కజొన్న సాగుపై రైతులకు వివరించారు. భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వాడటం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు సాగు వ్యయం తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ప్రశాంత్, చందు, లక్ష్మణ్, అనిల్, సామాజిక కార్యకర్త తోట శ్రీకాంత్‌తో పాటు గ్రామ సర్పంచులు షేక్ గౌస్, సూర్యకాంత్, అర్జున్ మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.






## కోటగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడిగా బార్ల మధుకర్ ఏకగ్రీవం

**పోతంగల్, నిజామాబాద్ జిల్లా 24 ఫిబ్రవరి(డీడీ9 వార్త) :**

పోతంగల్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన 14 గ్రామాల సర్పంచుల సమావేశంలో మండల సర్పంచుల ఫోరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఫోరం అధ్యక్షుడిగా కోటగిరి సర్పంచ్ బార్ల మధుకర్, ఉపాధ్యక్షుడిగా కొర్ర రవి (కొత్తపల్లి తండా), కార్యదర్శిగా గౌస్, కోశాధికారిగా పుప్పాల గంగారాం ఎంపికయ్యారు. ముఖ్యఅతిథిగా హాజరైన కొట్టం మనోహర్ నూతన కార్యవర్గాన్ని ప్రకటించగా సలహాదారులుగా సీతకుమారి, పుష్పవతి, మీనాభాయ్, ఇర్వంత్ పటేల్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మధుకర్ మాట్లాడుతూ.. మండలంలోని సర్పంచుల సమస్యల పరిష్కారానికి, గ్రామల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

MRUNAL THAKUR



## ఏడుస్తూ నిద్రపోయిన రోజులు ఎన్నో ఉన్నాయి

శరీర బరువు కారణంగా తాను గతంలో ట్రోలింగ్‌ను ఎదుర్కొన్నట్లు నటి మృణాల్ ఠాకూర్ చెప్పారు. అది తనపై తీవ్ర ప్రభావాన్ని చూపిందని.. ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసిందని అన్నారు. అలాంటి వాటిని పట్టించుకోవడం మానేసిన తర్వాత చాలా మార్పు వచ్చిందన్నారు. అక్షయ్ కుమార్ మాటలు తనలో ధైర్యాన్ని పెంచాయని తాజాగా ఓ ఇంటర్వ్యూలో చెప్పారు.

"నాకు ఇంకా ఆ రోజులు గుర్తున్నాయి. ఏడుస్తూ నిద్రపోయి.. ఉబ్బిన కళ్లతో మేల్కొన్న రోజులు ఎన్నో ఉన్నాయి. శరీరాకృతి కోసం అంత ఆందోళన చెందాల్సిన అవసరం లేదు అని నాకు నేను అనుకునేదాన్ని. దాన్ని అధిగమించడానికి చాలా ధైర్యం కావాలి. అప్పట్లో నా చుట్టూ ఉండేవారు కూడా నన్ను ట్రోల్ చేసేవారు. కానీ, ఒక రోజు జిమ్‌కు వెళ్లినప్పుడు సన్నటి అమ్మాయి నా వద్దకు వచ్చి 'నేను మీలాగా మారాలంటే ఏం చేయాలి' అని అడిగింది. అప్పుడే అర్థమైంది.. మనం ఎలా ఉన్నా నచ్చేవాళ్లకు నచ్చుతామని. మనల్ని మనం గౌరవించుకుంటే ఇతరులు కూడా విలువిస్తారు" అని మృణాల్ చెప్పారు.

గతంలో అక్షయ్ కుమార్ చెప్పిన మాటలను ఆమె పంచుకున్నారు. "ఆయన మాటల తర్వాత నాలో చాలా మార్పు వచ్చింది. వేల మంది ట్రోల్స్ చేసినా అవేవి వినకుండా కొనసాగాలని అన్నారు. కానీ, సినిమాలో పాత్ర కోసం సన్నగా మారాల్సి వస్తే కచ్చితంగా మారాలని చెప్పారు. అప్పటి నుంచి ఆ మాటలే ఫాలో అవుతున్నాను" అని తెలిపారు.



## ఆ విషయంలో.. ఆడియన్స్‌ని మోసం చేయలేను..

టాలీవుడ్, బాలీవుడ్ చిత్ర పరిశ్రమల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అందాల భామ రకుల్ ప్రీత్ సింగ్. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, విలక్షణమైన పాత్రలతో ప్రేక్షకులను అలరిస్తున్న ఈ ఢిల్లీ బ్యూటీ, వృత్తి పట్ల తనకున్న నిబద్ధతను చాటుకుంది. సాధారణంగా పరభాషా హీరోయిన్లు లిప్ సింక్ కోసం డైలాగులు రాకపోయినా మేనేజ్ చేస్తుంటారు. అయితే, ఈ పద్ధతిపై రకుల్ ఘాటుగా స్పందించారు. పని చేసే ఇండస్ట్రీ పట్ల గౌరవం ఎలా ఉండాలో వివరిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి.

తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో రకుల్ తన సినీ ప్రయాణం,భాషా పరిజ్ఞానం గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.. 'నేను స్వతహాగా మోసగాడిని కాదు. షూటింగ్ సమయంలో భాష తెలియకుండా కేవలం 1 2 3 4 లేదా ABCD అని అంకెలు, అక్షరాలు వల్లెవేస్తూ నా డైలాగ్ లైన్లను పూర్తి చేయలేను. ఏ పరిశ్రమ అయితే మనకు అన్నం పెడుతుందో, ఏ ప్రేక్షకులు అయితే మనకు అపారమైన ప్రేమాభిమానాలు అందిస్తారో.. ఆ ఇండస్ట్రీకి మనం ఇచ్చే కనీస గౌరవం అక్కడి భాషను నేర్చుకోవడమే' అని రకుల్ స్పష్టం చేశారు. కేవలం డైలాగులు చెప్పడం కోసం కాకుండా, పాత్రలోని భావాన్ని పండించాలంటే భాషా ప్రావీణ్యం అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు.

## రాజకీయాలు వద్దు.. వినోదమే కావాలన్నారు!



ఏ ఒక్కరినీ కించపరిచే సంభాషణలు కానీ, చిన్నబుచ్చుకునేలా చేసే సన్నివేశాలు కానీ 'ఉస్తాద్ భగత్‌సింగ్'లో ఉండవన్నారు ఆ చిత్ర దర్శకుడు హరీశ్‌శంకర్. సినిమాలు వేరు, రాజకీయాలు వేరని పవన్‌కల్యాణ్ నమ్మడంతోపాటు, అదే మార్గాన్నే అనుసరిస్తుంటారని అందుకు తగ్గట్టే సినిమా ఉంటుందన్నారు. పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా హరీశ్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రమే... 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మార్చి 26న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఆదివారం ఇందులోని ఆరా ఆఫ్ ఉస్తాద్... పాట విడుదలైంది. ఈ సందర్భంగా హరీశ్ సోమవారం ఓ ప్రత్యేకమైన వీడియోను విడుదల చేశారు. "పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వానికి, ఆయన నడవడికకు దగ్గరగా ఉండే ఈ పాటకి లభిస్తున్న స్పందన ఎంతో ఆనందాన్నిచ్చింది. అయితే కొంతమంది 'ఇందులో రాజకీయ పరమైన సంభాషణలు ఉంటాయా?' అని అడుగుతున్నారు. వాళ్లని ఉద్దేశించే ఈ వీడియో చేస్తున్నా. ఈ సినిమా మొదలుపెట్టిన రోజే కథానాయకుడు పవన్‌కల్యాణ్ 'వినోదం పంచడమే అంతిమలక్ష్యం కావాలి. ఆ ఉద్దేశం దెబ్బతినేలా సినిమా ఉండకూడద'ని స్పష్టంగా చెప్పారు. సైద్ధాంతిక విభేదాలు ఉన్నా వాటిని పక్కనపెట్టి ప్రకాశ్‌రాజ్‌తో కలిసి నటించారు పవన్‌కల్యాణ్. సిద్ధాంతాలపై పోరాటమే తప్ప, వ్యక్తిగతంగా ఆయన ఎవ్వరినీ లక్ష్యంగా చేసుకోరు. ఇందులోని సంభాషణలు హీరోయిజాన్ని ఆవిష్కరించేలా ఉంటాయే తప్ప, ఎవ్వరినీ తక్కువ చేసేలా ఉండవు. పవన్‌కల్యాణ్‌కు అన్ని పార్టీల్లోనూ అభిమానులు ఉన్నారు. ఓట్లు ఎవరికి వేసినా సినిమా అంటే ఈయన దగ్గరికే వస్తారు. అభిమానులు కూడా చాలా మంది ఆయన వ్యక్తిత్వాన్నే అనుసరిస్తూ 'మాకు సినిమాలో రాజకీయాలు వద్దు, మాకు వినోదమే కావాలి' అన్నారు. అభిమానులు పవన్‌కల్యాణ్ స్టైల్‌ని, ఆయన స్వాగ్‌ని మాత్రమే కాదు, ఆయన సిద్ధాంతాల్నీ అనుసరిస్తున్నందుకు వాళ్లకు హ్యాట్సాఫ్ చెప్పాలి. ఇందులో ఒక్క వ్యక్తిని, వర్గాన్ని, పార్టీని కానీ తక్కువ చేసేలా సంభాషణలు ఉండవు. ప్రతి ఒక్కరూ ఆస్వాదించేలా సినిమా ఉంటుంది" అన్నారు హరీష్‌శంకర్.



## కేవలం అందం ఉంటే సరిపోదు..

టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు గత పదిహేనేళ్లుగా తనదైన ముద్ర వేస్తూ, నేటితరం హీరోయిన్లకు గట్టి పోటీ ఇస్తున్న నటి తమన్నా భాటియా. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ 'మిల్కీ బ్యూటీ', తాజాగా సినిమా పరిశ్రమలోని గెలుపోటములపై స్పందించింది. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవడం వెనుక ఉన్న అసలు రహస్యం కేవలం అందం మాత్రమే కాదని చెబుతూ ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారాయి.

తమన్నా తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో 'సినిమా ఇండస్ట్రీలో ఏదీ శాశ్వతం కాదు, ప్రతి శుక్రవారం ఇక్కడ తలరాతలు మారిపోతాయి.. మీరు ఎంత కాలం నుంచి పనిచేస్తున్నారు లేదా గతంలో ఎంత గొప్పగా చేశారు అన్నది ముఖ్యం కాదు, ఆ వారం విడుదలయ్యే సినిమా ఫలితమే ప్రజలు మిమ్మల్ని చూసే విధానాన్ని మారుస్తుంది. అందుకే ఈ పరిశ్రమ ఎవరికైనా వినయాన్ని నేర్పుతుంది' అని తమన్నా అభిప్రాయపడింది. అలాగే 'ఇక్కడ సక్సెస్ ఉన్నప్పుడే గౌరవం దక్కుతుంది, అది తనను ఎప్పుడూ నేల మీద ఉండేలా చేస్తుంది' అని ఆమె చెప్పుకొచ్చింది. ముఖ్యంగా తన గ్లామర్ గురించి వస్తున్న వార్తలపై తమన్నా చాలా స్పష్టంగా స్పందించింది.. 'నేను కేవలం అందంగా ఉన్నాననో లేక తెల్లగా ఉన్నాననో నాకు అవకాశాలు వస్తాయని నేను ఎప్పుడూ భ్రమపడలేదు. నేను కేవలం ఒక గ్లామర్ బొమ్మను మాత్రమే కాదు.. అలా ఎవరైనా నాకు పని ఇస్తారని నేను తప్పుడు అంచనా వేయలేదు. అదే సమయంలో, నేను తెలివైన దాన్ని కాదని ఎవరైనా అనుకున్నా నాకు ఎప్పుడూ సమస్యలేదు. నా పని నేను చేసుకుంటూ వెళ్లడమే నాకు తెలుసు' అంటూ తన ఆత్మవిశ్వాసాన్ని చాటుకుంది.

TIA

## మహేశ్‌బాబు, రాజమౌళి ఫైట్.. ఏఐ వీడియోను షేర్ చేసిన వర్మ

అసాధ్యాలను సైతం సుసాధ్యం చేస్తోంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ). ఏది నిజమో? ఏది అబద్ధమో? తెలుసుకోలేనంతగా సమాచారాన్ని వ్యాప్తి చేస్తోంది. ఏఐ సహాయంతో సృష్టించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల వేదికగా కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. అచ్చం అలాంటి ఒక వీడియోనే సినీ దర్శకుడు రామ్ గోపాల్‌వర్మ తాజాగా పంచుకున్నారు. ఇంతకీ అందులో ఏముందో తెలుసా?

స్టార్ హీరో మహేశ్‌బాబు, అగ్ర దర్శకుడు ఎస్.ఎస్.రాజమౌళి గొడవ పడుతున్నట్లు ఉన్న ఆ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 'సినిమా ఈజ్ డెడ్' అంటూ వర్మ పంచుకున్న ఈ ఫైటింగ్ వీడియోపై అనేక కామెంట్స్ వినిపిస్తున్నాయి. కొందరు ఈ క్రియేటివిటీని మెచ్చుకుంటుంటే, మరికొందరు తప్పుపడుతున్నారు. 'ఏఐతో ఏదైనా సాధ్యమే!' అంటూ కామెంట్లు పెడుతున్నారు. 'వారణాసి ప్రచారం సమయంలో కచ్చితంగా ఈ వీడియోను ప్లే చేస్తా'రని వ్యాఖ్యలు జోడిస్తున్నారు. 'మహేశ్ పాస్‌పోర్ట్ విషయంలోనే ఇద్దరూ గొడవపడుతున్నారు' అంటూ అభిమానులు స్పందించడం గమనార్హం.

మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందుతోన్న ఎపిక్ యాక్షన్ అడ్వెంచర్ ఫిల్మ్ 'వారణాసి'. పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రియాంక చోప్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ జరుగుతోన్న ఈ మూవీ వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా కథా నేపథ్యాన్ని పరిచయం చేస్తూ ఇటీవల విడుదల చేసిన వీడియో, సినిమాకు సంబంధించి పలు విషయాలను తెలియజేస్తూ ఇచ్చిన ఇంటర్వ్యూలు 'వారణాసి'పై ఆసక్తి పెంచాయి.





## ది కేరళ స్టోరీ 2.. హైకోర్ట్ కీలక ఆదేశాలు

ది కేరళ స్టోరీ 2' విడుదలకు ముందు కోర్టులో ప్రదర్శించాలని కేరళ హైకోర్టు పేర్కొంది. ఈ సినిమాలో కేరళను తప్పుగా చూపించారని ఆరోపణలు నెలకొన్న నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అంశాలు ఉన్నాయనే రాష్ట్ర ప్రజల ఆందోళనలను విస్మరించలేమని కోర్టు పేర్కొంది. ఈ సినిమాసెన్సార్‌ను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై మంగళవారం కేరళ హైకోర్టులో విచారణ జరిగింది. కోర్టులు సాధారణంగా సినిమాలకు సంబంధించి భావవ్యక్తీకరణ స్వేచ్ఛ విషయంలో జోక్యం చేసుకోదు. కానీ.. ఈ సినిమా టైటిల్‌లో కేరళ రాష్ట్రం పేరు ఉపయోగించారని ఈ నేపథ్యంలో దీనిపై విచారణకు అంగీకరించినట్లు పేర్కొంది. ఫిబ్రవరి 25న 'ది కేరళ స్టోరీ 2'ను కోర్టులో ప్రదర్శించాలని ఆ తర్వాతే దీని సెన్సార్ విషయంలో నిర్ణయం తీసుకోగలమని తెలిపింది.

కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాకు సెన్సార్ బోర్డు ఇటీవల 'యూ/ఏ' సర్టిఫికెట్ జారీ చేసింది. 2023లో వివాదాల నడుమ విడుదలైన 'ది కేరళ స్టోరీ'కి సీక్వెల్‌గా రూపొందింది 'ది కేరళ స్టోరీ 2: గోస్ బియాండ్'. టీజర్, ట్రైలర్లు విడుదలయ్యాక ఈ మూవీ కూడా చర్చనీయాంశంగా మారింది. దీనిపై తాజాగా.. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ దీనిపై స్పందించారు. ఈ సినిమాపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. దీన్ని బహిష్కరించాలని పిలుపునిచ్చారు. ఫిబ్రవరి 27న ఈ చిత్రం విడుదల కానుంది.